PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 194 | విజయవాడ, సోమవారం 19 ఫిబ్రవరి 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 19 February 2024 | Rs



మనోళ్లు బంగారం

- మహిళల జట్టుకు పసిడి పతకం
- ఆసియా టీమ్ ఛాంపియన్‌షిప్స్

6

డయేరియాతో మరొకరు మృతి

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో డయేరియాతో చికిత్స పొందుతున్న మరో వ్యక్తి మృతి చెందారు. దీంతో, డయేరియా మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. గుంటూరులోని శ్రీనగర్‌కు చెందిన గాజుల సూర్యనారాయణ (75) నాలుగు రోజుల క్రితం విరోచనాలతో స్థానిక ప్రయివేటు ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మరణించారు. కిడ్నీ సమస్య కూడా ఉండడం వల్ల సూర్యనారాయణ మృతి చెందినట్టు అధికారులు చెబుతున్నారు. విరోచనాలు ఎక్కువగా రావడం వల్లే ఆయన మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. డయేరియా తీవ్రత వల్ల కిడ్నీ కూడా ఫెయిల్ అయి ఉండవచ్చని చెబుతున్నారు. డయేరియాతో గతంలో మృతి చెందిన వారిలో ఓబులేసు, పద్మ, ఇక్బాల్ ఉన్నారు. కాగా, గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లోని డయేరియా వార్డులో ఇప్పటికే 62 మంది చికిత్స పొందుతుండగా, ఆదివారం మరో తొమ్మిది మంది కొత్తగా చేరారు.



ఢిల్లీలోని శంభు సరిహద్దులో కుటుంబ సభ్యులతో కలిసి నిరసన తెలుపుతున్న రైతులు

మళ్లీ విఫలం

రైతు నేతలు, కేంద్ర మంత్రుల మధ్య పురోగతి లేని చర్చలు

కుటుంబాలతో రైతుల నిరసన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కనీస మద్దతు ధర చట్టం, రుణమాఫీ తదితర రైతుల డిమాండ్లపై రైతు నేతలు, కేంద్ర మంత్రుల మధ్య చర్చలు విఫలమయ్యాయి. దీంతో ఢిల్లీ సరిహద్దుల్లో ఉద్యమం కొనసాగుతుందని రైతులు ప్రకటించారు. పంజాబ్ - హర్యానా సరిహద్దుల్లోని శంభు వద్ద రైతుల ఉద్యమం ఆరో రోజు కొనసాగింది. కుటుంబ సభ్యులతో కలిసి రైతులు నిరసనలో పాల్గొన్నారు. ఆదివారం చండీగఢ్‌లోని మహాత్మా గాంధీ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎంజిఎస్ఐపిఎ) రైతు నాయకులతో కేంద్ర మంత్రులు నాలుగో విడత చర్చలు జరిగాయి. చర్చల్లో రైతు నేతలు కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం) సమన్వయకర్త సర్వన్ సింగ్ పంధేర్, బికెయు ఏక్తా (సిధుపూర్) అధ్యక్షుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ హాజరయ్యారు. కేంద్ర వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్, కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ పాల్గొన్నారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మన్ కూడా చర్చల్లో పాల్గొన్నారు. అంతకుముందు కేంద్ర మంత్రులు, పంజాబ్ సిఎం హోటల్ లో భేటీ అయి, రైతు ఆందోళనపై చర్చించారు. సమావేశానికి ముందు, పంధర్ మాట్లాడుతూ, తమకు ఆశ ఉందని, బంతి ఇప్పుడు కేంద్రం కోర్టులో ఉందని అన్నారు.

కుటుంబాలతో రైతుల నిరసన

కుటుంబ సభ్యులతో కలిసి రైతులు ఆదివారం ఆందోళనలో పాల్గొన్నారు. ఢిల్లీలోని శంభు సరిహద్దు వద్ద జరుగుతున్న ఆందోళనలో పాల్గొంటున్న మహిళా రైతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొంటూ, భోజన ఏర్పాట్లలో సహకరిస్తున్నారు. రైతు కుటుంబాలకు చెందిన మహిళలు తమ పిల్లలతో కలిసి నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. పంజాబ్‌లోని అమృతసర్, లూథియానా, ఫిరోజ్‌పూర్ ప్రాంతాల రైతులు ఎక్కువగా వచ్చారు.

21న బిజెపి, ఎన్‌డిఎ ఎంపిల ఇళ్ల వద్ద నల్లజెండాలతో నిరసన

- సంయుక్త కిసాన్ మోర్చా

5

పంటల బీమాకు కేంద్రం గండి



ఖరీఫ్‌లో నిధులకు భారీ కోత

- రాష్ట్రం చెల్లించింది రూ. 860 కోట్లు
- కేంద్రం విడుదల చేసింది రూ. 250 కోట్లు
- విపత్తు రైతులకు భారీ నష్టం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఖరీఫ్‌లో పంటల బీమా అస్తవ్యస్తంగా తయారైంది. కేంద్రం తన వాటా ప్రీమియాన్ని బాగా తగ్గించుకుంది. ఫిబ్రవరి మధ్యలోకొచ్చినా తాను చెల్లించాల్సిన వాటాను పూర్తి స్థాయిలో విడుదల చేయలేదు. ప్రీమియం చెల్లింపుల్లో రాష్ట్ర సర్కారు ఆలస్యం కారణంగా కేంద్రం నిధులు విడుదల చేయలేదని తెలుస్తోంది. ఫసల్ బీమా (దిగుబడి ఆధారిత)లో రైతుల తరపున ఎపి ప్రభుత్వం దాదాపు రూ.441 కోట్లు కంపెనీలకు చెల్లించగా, కేంద్రం తన వాటా కింద కేవలం రూ.79 కోట్లే చెల్లించింది. వాతావరణ ఆధారిత బీమా కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.418 కోట్లు చెల్లించగా కేంద్రం రూ.171 కోట్లు చెల్లించింది. మొత్తమ్మీద రెండు పథకాలకూ కలిపి ఇప్పటి వరకు రాష్ట్ర సర్కారు రూ.860 కోట్లు చెల్లించగా కేంద్రం మాత్రం రూ.250 కోట్లే చెల్లించింది. ఫసల్‌లో ఎక్కువగా ప్రభుత్వరంగ సంస్థలున్నందున కేంద్రం తక్కువ ప్రీమియం చెల్లించినట్లు కనిపిస్తోంది. వాతావరణ బీమాలో అన్నీ ప్రైవేటు సంస్థలే. ఫసల్‌తో పోల్చితే వాతావరణ బీమాకు కొంచెం ఎక్కువ ప్రీమియం చెల్లించిందని తెలుస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దోబూచులాట లో విపత్తు రైతులకు బీమాపై ధీమా లేకుండా పోయింది.

గతేడాది కంటే తక్కువ

వైసిపి వచ్చాక 2021-22 వరకు కేంద్రంతో, కంపెనీలతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే పంటల బీమాను అమలు చేసింది. కేంద్రం ఒత్తిడితో 2022 ఖరీఫ్ నుంచి తిరిగి కేంద్ర పథకాల్లో చేరింది. ఆ ఏడాది ఫసల్‌లో కంపెనీలను ఆహ్వానించింది. వాతావరణ బీమాను మాత్రం తానే నిర్వహించింది. కేంద్ర పథకంలో చేరాక 2022 ఖరీఫ్‌లో 50 లక్షల ఎకరాలను ఫసల్ కిందికి తెచ్చారు. 25 లక్షల మంది రైతులను చేర్చారు. రాష్ట్ర సర్కారు ఉచిత బీమా అమలు చేస్తున్నందున రైతులు తన వంతు చెల్లించాల్సిన ప్రీమియంతో కలిపి రూ.1,212 కోట్లూ తానే చెల్లించింది. కేంద్రం తన వాటా కింద రూ.669 కోట్లు బదిలీ చేసింది. గ్రాస్ ప్రీమియం రూ.1,882 కోట్లు. పథకం నిబంధన ఏంటంటే... నిర్ణయించిన మొత్తం ప్రీమియంలో రైతులు తమ వంతు 2 శాతం చెల్లించాలి. తతిమ్మా దాంట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించాలి. ఆ ప్రకారం రైతుల ప్రీమియం రూ.543 కోట్లవుతుంది. ఆ అమౌంట్‌ను రాష్ట్రం రైతుల తరపున చెల్లించింది. అది పోగా మిగతా ప్రీమియంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం పెట్టుకోవాలి కనుక అందులో రూ.669 కోట్లను రాష్ట్రం, మరో 669 కోట్లు కేంద్రం భరించాయి. 2023 ఖరీఫ్ దగ్గరకొస్తే రైతుల సంఖ్య 22 లక్షలకు తగ్గింది. ఏరియా 47 లక్షల ఎకరాలకు కుచించుకు పోయింది. రాష్ట్రం 441 కోట్లు చెల్లించగా కేంద్రం కేవలం రూ.79 కోట్లే చెల్లించింది. కాగా రైతుల ప్రీమియం రూ.294 కోట్లుగా చూపారు. రాష్ట్ర వాటా 146 కోట్లుగా చూపెట్టారు. ఆ ప్రకారం చూస్తే మాత్రం కేంద్రం చెల్లించాల్సింది రూ.79 కోట్లే అవుతోంది. రాష్ట్రం నిబంధనలు పాటించనందున ఎక్కువ ప్రీమియం చెల్లించాల్సి వచ్చిందని చెబుతున్నారు. ఫసల్ బీమాలో కేంద్ర వాటా కొన్ని జిల్లాల్లో సున్నా. అల్లూరి, అనకాపల్లి, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కృష్ణా, మన్యం, నెల్లూరు, తిరుపతి, విశాఖ, విజయనగరం, పశ్చిమగోదావరిలో కేంద్రం వాటా జీరో. ఆ జిల్లాల్లో రాష్ట్రం రైతుల వాటా, తన వాటా చెల్లించింది.

వెదర్ బేస్డ్

2023 ఖరీఫ్‌లో వాతావరణ ఆధారిత బీమా కూడా కేంద్ర పరిధిలోకి వెళ్లింది. 21 జిల్లాల్లో అమలైంది. అన్ని జిల్లాలనూ ప్రైవేటు కంపెనీలకే అప్పగించారు. ఏడు లక్షల మంది రైతులను పథకంలో చేర్చారు. ఏరియా 17.15 లక్షల ఎకరాలు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల, తన వాటా కలిపి రూ.418 కోట్లు చెల్లించింది. కేంద్రం 171 కోట్లు మాత్రమే చెల్లించింది. రాష్ట్రం రైతుల తరపున రూ.209 కోట్లు, అది పోను తన వాటా (50 శాతం) రూ.219 కోట్లు చెల్లించింది. కేంద్రం ఏ లెక్కలో రూ.171 కోట్లు చెల్లించిందో తెలీదు. వాతావరణ బీమాను ప్రైవేటు సంస్థలు అమలు చేస్తున్నందున ఫసల్‌తో పోల్చితే ఈ పథకానికి కేంద్రం నుంచి ఎక్కువ నిధులు వచ్చాయని తెలుస్తోంది.

99% హామీలను నెరవేర్చాం

- టిడిపిని గెలిపించేందుకు పెత్తందారులంతా ఏకమవుతున్నారు
- రాప్తాడు 'సిద్ధం' సభలో ముఖ్యమంత్రి జగన్





రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో విల్లు ఎక్కుపెట్టిన ముఖ్యమంత్రి జగన్, హాజరైన వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో రాయలసీమ స్థాయి 'సిద్ధం' సభ ఆదివారం జరిగింది. ఈ సభలో జగన్ మాట్లాడుతూ 'చంద్రబాబు వయసు ఈ ఎన్నికల తరువాత 80 ఏళ్లకు చేరుకుంటుంది. ఆ పార్టీ ఓడిపోతే రాష్ట్రంలో టిడిపి రూపురేఖలు ఉండవు. అందుకే పెత్తందారులంతా ఏకమవుతున్నారు. టిడిపిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు' అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో మొత్తం 175 అసెంబ్లీ స్థానాల్లోనూ, 25 పార్లమెంటు స్థానాల్లోనూ గెలవడం వైసిపి టార్గెట్ అని, ఇందుకు కార్యకర్తలంతా కృషి చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో రంగురంగుల మ్యానిఫెస్టోలు

మిగతా 2లో

బహిరంగ చర్చకు సిద్ధమా ..?

- జగన్‌కు బాబు సవాల్
- ఎక్కడైనా, ఏ రోజైనా వస్తా
- ఎవరి పాలన స్వర్ణయుగమో తేలుస్తాం

2

రేపు సిపిఎం, సిపిఐ రాష్ట్ర సదస్సు

జయప్రదం చేయాలని రాష్ట్ర కమిటీల పిలుపు

- రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపి
- ఆ పార్టీతో జతకడుతున్న టిడిపి-జనసేన
- నిరంకుశ వైసిపిలకు వ్యతిరేకంగా కదలండి
- ప్రజలకు, ప్రజాతంత్ర వాదులకు విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి, ఆ పార్టీతో జతకడుతున్న టిడిపి, జనసేన కూటమికి, నిరంకుశ వైసిపికి వ్యతిరేకంగా రేపు (20వ తేది, మంగళవారం) విజయవాడలో జరగనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం, సిపిఐ రాష్ట్ర కమిటీలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ఉమ్మడి ప్రకటనలో ఈ సదస్సుకు పెద్దసంఖ్యలో తరలిరావాలని ప్రజలకు, ప్రజాతంత్ర వాదులకు విజ్ఞప్తి చేశాయి. దేశంలో, రాష్ట్రంలో బిజెపి మతోన్మాద ప్రమాదం పెచ్చరిల్లిపోతోందని, స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో రూపొందించుకున్న రాజ్యాంగానికి ముప్పు ఏర్పడిందని ఆ పార్టీలు పేర్కొన్నాయి. నిరంకుశత్వం రాజ్యమేలుతోందని, రాష్ట్రంలో కొత్త రాజకీయ సమీకరణాలను తనకు అనుకూలంగా మలచుకోవడానికి బిజెపి తీవ్రంగా ప్రయత్నిస్తోందని తెలిపాయి. ప్రాంతీయ పార్టీల సహకారంతో బిజెపి బలపడే ప్రమాదం కనిపిస్తోందని పేర్కొన్నాయి. ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలు చేయకుండా, విశాఖ ఉక్కును అమ్మకానికి పెట్టిన విద్రోహ పార్టీగా బిజెపిని అభివర్ణించాయి. పోలవరం ప్రాజెక్టుకు , రాజధానికి నిధులివ్వకపోయినా తెలుగుదేశం, జనసేన పార్టీలు బిజెపి కొమ్ము కాస్తున్నాయని, వైసిపి పూర్తిగా లొంగిపోయి అనధికార ఎన్‌డిఎ సభ్యులుగా కొనసాగుతోందని విమర్శించాయి. జనసేన ఇప్పటికే ఎన్‌డిఎలో ఉండగా, కొత్తగా తెలుగుదేశం చేరబోతోందని, ఈ పరిణామం రాష్ట్ర వినాశనానికి, మత సామరస్యం దెబ్బతినడానికి, సామాజిక న్యాయానికి విఘాతం కలగడానికి దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశాయి. రానున్న ఎన్నికలలో

ఈ శక్తులను అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఎం, సిపిఐ రాష్ట్ర కమిటీలు తెలిపాయి. ప్రజలపై వైసిపి భారాలు వేయడమే కాకుండా ప్రశ్నిస్తున్న వారిని అణచివేస్తోందని,

మిగతా 2లో

బాబు, పవన్‌లకు బిజెపి అధిష్టానం పిలుపు?

- 21న పొత్తులపై స్పష్టత వచ్చే అవకాశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి పొత్తుల అంశం కొలిక్కి రానున్నట్లు తెలిసింది. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడుకు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు మరోసారి బిజెపి అధిష్టానం నుండి పిలుపు వచ్చినట్టు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం రేపు (మంగళవారం) వారిద్దరిని అందుబాటులో ఉండాలని బిజెపి నేతలు కోరారు. అవసరమైతే ఆ రోజు ఢిల్లీకి రావాల్సిఉంటుందని బిజెపి నాయకత్వం సూచించినట్లు చెబుతున్నారు. దీంతో ఈ నెల 21న ఎన్‌డిఎ పొత్తులపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇప్పటికే ఈ దిశలో ప్రకటన వెలువడి ఉండాల్సిందని, బిజెపి జాతీయ కౌన్సిల్ సమావేశాల నేపథ్యంలో ఆలస్యమైందని అంటున్నారు. బిజెపితో పొత్తు ఖాయమని తేలడంతో సీట్ల సర్దుబాటు గురించి టిడిపి, జనసేన నేతల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. వైసిపి నుండి వచ్చే నేతలను చేర్చుకునే విషయమై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఏ పార్టీకి ఎన్ని సీట్లు ?


విశ్వసనీయ సమాచారం మేరకు బిజెపి 10 ఎమ్మెల్యే, ఆరు ఎంపి సీట్లు అడుగుతోంది. వీటిల్లో రాజమండ్రి, నరసాపురం, రాజంపేట ఎంపి సీట్లు ఇచ్చేందుకు టిడిపి సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. మచిలీపట్నం, కాకినాడ, అనకాపల్లి, తిరుపతి పార్లమెంటు సీట్లను జనసేన అడుగుతుండగా, మచిలీపట్నం, కాకినాడ సీట్లు ఇచ్చేందుకు టిడిపి నుంచి అంగీకారం ఉందని సమాచారం. తప్పని సరైతే అనకాపల్లి కూడా ఇచ్చే వీలుంది. ఎమ్మెల్యే సీట్ల విషయానికి జనసేన 28 నుంచి 33 స్థానాలు కోరుతున్నట్లు తెలిసింది.

సీనియర్లకు బుజ్జగింపులు

పొత్తుల్లో భాగంగా ఎవరి సీటు త్యాగం చేయాల్సి వస్తోందోననే భయం టిడిపి సీనియర్ నేతల్లో కనిపిస్తోంది. సీటింగ్ ఎమ్మెల్యేలకు ఖచ్చితంగా సీటు ఇవ్వాల్సిందేనని సీనియర్లు పట్టుపడుతున్నారు. ఇదే సందర్భంలో టిడిపి సిట్టింగ్ స్థానాలను బిజెపి, జనసేనకు కేటాయించాల్సి వస్తే సీనియర్ శాసనసభ్యుల రాజకీయ భవిష్యత్ ముగిసినట్లేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సిట్టింగు స్థానాలను త్యాగం చేసేందుకు టిడిపి సీనియర్లు అంగీకరించడం లేదని తెలిసింది. వారికి నచ్చజెప్పే పనిలో టిడిపి నాయకత్వం ఉంది.

కేంద్రానికి లొంగిన జాతీయ మీడియా

- వెలుగులోకి రాని ప్రజాసమస్యలు
- రైతు ఉద్యమ కవరేజే నిదర్శనం
- నార్ల వెంకటేశ్వరరావు పురస్కార ప్రదాన సభలో పాలగుమ్మి సాయినాథ్



నార్ల వెంకటేశ్వరరావు పురస్కారం అందుకుంటున్న పాలగుమ్మి సాయినాథ్

ప్రజాశక్తి- గుంటూరు జిల్లాప్రతినిధి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి జాతీయ, కార్పొరేట్ మీడియా సంస్థలు దాసోహం అంటున్నాయని ప్రముఖ జర్నలిస్టు, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత పాలగుమ్మి సాయినాథ్ అన్నారు. గుంటూరులోని కొరటాల భవన్‌లో అంబేద్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నార్ల వెంకటేశ్వరరావు పురస్కారాన్ని ఆదివారం రాత్రి పాలగుమ్మి సాయినాథ్‌కు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఫౌండేషన్ అధ్యక్షులు బి.విల్సన్ అధ్యక్షత వహించారు. సాయినాథ్ మాట్లాడుతూ వివిధ కారణాలతో మీడియా సంస్థలు మోడీ సర్కారుకు లొంగిపోవడంతో ప్రజా సమస్యలు వెలుగులోకి రావడం లేదని అన్నారు. ఢిల్లీలో రైతులు చేస్తున్న ఉద్యమానికి జాతీయ మీడియా ఇస్తున్న కవరేజే దానికి నిదర్శమన్నారు. ఒక్క జాతీయ పత్రికలో కూడా కనీసం ప్రభుత్వ తీరును ఎండగడుతూ ఎడిటోరియల్ రాలేదని అన్నారు. రైతులపై కేంద్ర బలగాలు కనీవినీ ఎరుగని రీతిలో దాడులకు పాల్పడుతున్నాయని ధ్వజమెత్తారు. అన్నదాతలపై ప్రభుత్వం డ్రోన్లు, వైమానిక దాడులు చేయడం అత్యంత పాశవికమని తెలిపారు. ఇతర దేశాల టెర్రరిస్టులపై ప్రయోగించాల్సిన డ్రోన్లు, వైమానిక దాడులు మన దేశ రైతులపై ప్రయోగిస్తున్నారని అయినా కార్పొరేట్ మీడియా సంస్థలు పట్టించుకోవడం లేదన్నారు. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం పాశవికమైన దమనకాండకు పాల్పడుతోందని, హర్యానా, పంజాబ్ ప్రభుత్వాలతోపాటు కేంద్ర ప్రభుత్వం రైతుల పట్ల వ్యవహరిస్తోన్న తీరు సరికాదన్నారు. దేశంలో పత్రికా వ్యవస్థ అంబానీ గుప్పిట్లోకి వెళ్లి పోయిందన్నారు. ప్రస్తుత కేంద్ర పాలకులు సమాజాన్ని మత, కుల పరంగా విభజిస్తున్నారని విమర్శించారు. సుప్రీంకోర్టులో చాలాకాలం తరువాత మంచి తీర్పు వచ్చిందంటూ ఎలక్ట్రోరల్ బాండ్ల రద్దు తీర్పును ప్రస్తావించారు. అయితే, తీర్పులో తీవ్ర జాప్యం జరిగిందన్నారు. ప్రతిపక్షాలకు ఎవరి నుంచీ విరాళాలు అందకుండా కట్టడి చేయడంలో భాగంగానే ఎలక్ట్రోరల్ బాండ్లను మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. గత ఐదేళ్లలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుల్లో కేంద్రానికి

మిగతా 2లో

ఏనుగు దాడిలో ఇద్దరు మహిళల మృతి

చెన్నై : అడవి ఏనుగు దాడి చేయడంతో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. తమిళనాడు కృష్ణగిరి జిల్లా డెంకనికొట్టై అటవీ ప్రాంతంలో ఆదివారం ఈ ఘటనలు జరిగాయి. అన్నియాలం గ్రామానికి చెందిన వ్యవసాయ కార్మికురాలు వసంతమ్మ (37) పొలంలో పనికి వెళ్లగా, ఏనుగు ఆమెను తొండంతో దూరంగా విసిరివేసింది. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. డెంకనికొట్టై రేంజ్ ఫారెస్ట్ అధికారులు, పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇదే ఏనుగు సమీపంలోని దాసరపల్లి గ్రామానికి వెళ్లి అక్కడి మహిళ అశ్వతమ్మను తొక్కి చంపేసింది. ఈ ఘటనలపై మృతుల బంధువులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. రెండు రోజుల క్రితమే సమాచారం ఇచ్చినా అధికారులు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఏనుగును తరిమివేయాలని, మృతుల కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

మరణంలోనూ వీడని బంధం

ప్రజాశక్తి -గోకవరం

భర్త అనారోగ్యంతో మృతి చెందాడాని కన్నీరు మున్నీరవుతూ భార్య కూడా ప్రాణం విడిచిన ఘటన తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలంలోని తంటికొండ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కోసూరు సత్యనారాయణ (70) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భార్య వరలక్ష్మి (65) అతనిపై పడి ఏడుస్తూ కన్నీరు మున్నీరుఅవుతూ కొద్దిసేపటికే ఆమె కూడా మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

సిఎం సభలంటే ప్రజలు బెంబేలు : టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి సభ అంటే ప్రజలు భయభ్రాంతులకు గురికావాల్సి వస్తుందని టిడిపి మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ముఖ్యమంత్రులు ఏం చెబుతారా అని ప్రజలు తండోపతండాలుగా సభలకు వెళ్లి వినేవారని, ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదని అన్నారు. ప్రజా రవాణా ఎక్కడికక్కడ స్తంభించిపోతుందని, సుదూర ప్రాంతాలకు ప్రయాణికులు వెళ్లాలంటే బస్సులు లేక అగచాట్లు పడుతున్నారని పేర్కొన్నారు. పాఠశాలలకు సెలవులు ఇస్తున్నారని, విద్యాసంస్థల బస్సులు లాక్కొని ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. పరీక్షలను సైతం వాయిదా వేయిస్తూ విద్యార్థుల భవిష్యత్తు కంటే సభలే మిన్నా అన్నట్లు భావిస్తున్నారని పేర్కొన్నారు.

రేపు సిపిఎం, సిపిఐ రాష్ట్ర సదస్సు

(మొదటిపేజీ తరువాయి)

అవినీతి విస్తరిస్తోందని, ప్రకృతి సంపదను బడా కార్పొరేట్లపరం చేస్తోందని ఆ పార్టీలు తెలిపాయి. వైసిపి రాష్ట్ర ప్రయోజనాలను కేంద్ర ప్రభుత్వం ముందు తాకట్టు పెడుతోందని, ఈ మూడు పార్టీలు బిజెపికి లొంగిపోయి ప్రజాభిష్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నాయి. ఈ పరిస్థితుల్లో బిజెపిని వ్యతిరేకించే లౌకిక పార్టీలు, రాష్ట్ర సమగ్రాభివృద్ధిని కోరుకునే పార్టీలు, సంఘాలు, సంస్థలు, వ్యక్తులు, శక్తులు ఉమ్మడి గళం వినిపించాలని, పరస్పరం సహకరించుకుని పనిచేయాలని కోరాయి. ఈ లక్ష్యంతో సిపిఎం, సిపిఐ రాష్ట్ర కమిటీలు ఫిబ్రవరి 20న ఉదయం 10 గంటలకు విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపాయి. ఈ సదస్సులో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు గిడుగు రుద్రరాజు, సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ, సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి శ్రీనివాసరావు, కె రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే ఎంఎ గఫూర్, సిపిఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ మూర్తి, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు వివి లక్ష్మీనారాయణ, విసికె పార్టీ రాష్ట్ర కార్యదర్శి విద్యాసాగర్, ఆర్ఎస్పి, ఫార్వర్డ్బ్లాక్, ఆమ్ఆద్మీ, ఎంసిపిఐయు పార్టీల నాయకులతో పాటు ఎస్కెఎం రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు చలసాని శ్రీనివాస్, వివిధ సంఘాల, సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపాయి. అందరూ ఈ సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశాయి.

కేంద్రానికి లొంగిన జాతీయ మీడియా

(మొదటిపేజీ తరువాయి)

అనుకూలంగా ఉన్నవే ఎక్కువగా వస్తున్నాయని, దీంతో, వ్యవస్థలపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఏర్పడిందని పేర్కొన్నారు. కరోనా సమయంలో కేంద్రం కోర్టులో అనేక తప్పుడు అఫిడవిట్లు దాఖలు చేసిందన్నారు. కరోనా వల్ల 2022 మార్చి నాటికి 5.22 లక్షల మంది మాత్రమే చనిపోయారని ప్రధాని మోడీ ప్రకటించగా, ఇంతకంటే పది రెట్లు ఎక్కువగా మరణాలు సంభవించారని అంతర్జాతీయ జర్నల్స్, డబ్ల్యుహెచ్ఒ వెల్లడించాయని గుర్తు చేశారు. ఉత్తరప్రదేశ్లోని కాశీ, సరయూ నదుల్లో వేలాది మంది మృతదేహాలు కొట్టుకొచ్చినా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదన్నారు. దైనిక్ భాస్కర్ పత్రిక వాస్తవాలు ప్రచురిస్తే, వెంటనే ఆ పత్రికపై ఇడి, సిబిఐ, ఇన్కంట్యాక్సు దాడులు జరిగాయని తెలిపారు. అనంతరం సుప్రసిద్ధ సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు పురస్కారాన్ని పి.సాయినాథ్కు మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు, బిసికె పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు జయసుధ, ఎండి అక్బర్బాబు, ప్రముఖ గాంధేయవాది అనిల్ నౌరియా తదితరులు పాల్గొన్నారు.

పేస్కేలు వేతనాలు చెల్లించాలి

- విఆర్ఎల రిలే నిరాహార దీక్షలను ప్రారంభించిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐవి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విఆర్ఎలకు తెలంగాణలో అమలవుతున్న విధంగా పేస్కేలు వేతనాలు చెల్లించాలని, నామినీలను విఆర్ఎలుగా రెగ్యులర్ చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు (ఐవి) డిమాండ్ చేశారు. విజయవాడలోని ధర్నా చౌక్లో ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఐవి మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వంలో ప్రజాస్వామ్య హక్కులు మృగ్యమయ్యాయన్నారు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల ఆధారంగా కార్మికవర్గం తమకు కనీస వేతనాలు చెల్లించాలని కోరుతుంటే ప్రభుత్వం మాత్రం నిర్బంధాన్ని ప్రయోగించి కార్మికుల గొంతు నొక్కుతోందన్నారు. ఉద్యోగ సంఘాలు సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేయకుండా ప్రభుత్వంతో రాజీ బేరాలు ఆడటం సరికాదన్నారు. కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ కార్మికుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని, సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండా, ఉద్యోగాలు పర్మినెంటు చేయకుండా ప్రభుత్వం లక్షలాది మంది అవుట్సోర్సింగ్ కార్మికులను మోసం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు మూడు, నాలుగు రెట్లు పెరిగాయని, చాలీచాలని వేతనాలతో బతుకుతున్న విఆర్ఎలు ఇతర పేదల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. విఆర్ఎల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సంఘటితంగా పోరాడాలని ఐవి పిలుపునిచ్చారు. విఆర్ఎల హక్కుల కోసం జరిగే పోరాటంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీల తరపున పూర్తి మద్దతు ఇస్తామన్నారు.

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కార్మికవర్గ హక్కులను కాలరాస్తూ పేదలకు ద్రోహం చేస్తోందన్నారు. అంగన్వాడీ, మున్సిపల్, సమగ్రశిక్ష ఉద్యోగులు పెద్దయెత్తున ఉద్యమించి ప్రభుత్వం మెడలు వంచి విజయం సాధించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విఆర్ఎలు పోరాడి సాధించుకున్న రూ.300 డిఎను వైసిపి ప్రభుత్వం దుర్మార్గంగా కోత పెట్టిందన్నారు. విఆర్ఎల న్యాయమైన పోరాటానికి సిఐటియు అన్ని రకాలుగా అండగా నిలుస్తుందన్నారు.

విఆర్ఎల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి అంజి, కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. గత నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించిందే తప్ప విఆర్ఎల సమస్యలు పరిష్కరించడంలో చొరవ చూపలేదన్నారు. నిత్యం దళితులు, గిరిజనులు, బలహీనవర్గాల జపం చేసే వైసిపి ప్రభుత్వం ఆ తరగతులకే చెందిన విఆర్ఎల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్ పోస్టుల్లో అర్హులైన విఆర్ఎలను నియమించకుండా కాలయాపన చేయడం తగదన్నారు. ప్రమోషన్ సౌకర్యాలను 30 నుంచి 70 శాతానికి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రీ సర్వేల పేరుతో విఆర్ఎలపై మోపుతున్న అదనపు భారాన్ని తొలగించాలన్నారు. ఈ నెల 7న అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చామని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే 20 తర్వాత ఎప్పుడైనా నిరవధిక సమ్మెకు దిగే అవకాశం ఉందని అన్నారు. విఆర్ఎల రిలే నిరాహార దీక్షలకు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మద్దతు ప్రకటించారు. దీక్షల్లో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రినాథరావు, రవికుమార్, రమేష్, నాగేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.



దీక్షలను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న ఎంఎల్సీ ఐవి

పాత పెన్షన్పై సిఎం హామీ అమలు చేయాలి

- సిపిఎస్ ఉద్యోగుల నిర్బంధం సరికాదు
- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పాత పెన్షన్ విధానం పునరుద్ధరిస్తాననే ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ ఎపిసిపిఎస్ ఉద్యోగులను ఛలో విజయవాడకు రానీయకుండా ఎక్కడికక్కడ నిర్బంధించటాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండించింది. ఈ చర్యలతో ప్రభుత్వ నిరంకుశ వైఖరి మరోసారి బహిర్గతమయిందని పేర్కొంది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎంతో కాలంగా ఆందోళన చేస్తున్న విషయాన్ని ఈ ప్రకటనలో గుర్తుచేశారు. ఎపిసిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపిచ్చిన చలో విజయవాడ కార్యక్రమాన్ని భగ్నం చేసి, ఉద్యోగులను రానీయకుండా నిర్బంధించడం గర్హనీయమని పేర్కొన్నారు. చర్చలకని పిలిచి అరెస్టు చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి పరిపాటి అయిందని, ఈ విధంగా ఉద్యోగుల కనీస ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. ఉద్యోగులును శుభకార్యాలకు కూడా మండలం దాటి వెళ్లనీయక ఇంటివద్ద, కార్యాలయాల వద్ద పహారా కాయడం అప్రజాస్వామికమని తెలిపారు. సిపిఎస్ ఉద్యోగుల చలో విజయవాడను రద్దు చేసుకునేట్లుగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిందని, రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ఖండించాలని కోరారు.

బిజెపివి బ్లాక్మెయిల్ రాజకీయాలు

- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రాంతీయ పార్టీలను కేంద్రంలోని బిజెపి బ్లాక్మెయిల్ చేసి తనకు అనుకూలంగా మార్చుకోవడానికి అన్ని రకాల కుయుక్తులూ పన్నుతోందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో చికిత్స పొందుతున్న గుంటూరు డయేరియా బాధితులను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతో కలిసి ఆదివారం ఆయన పరామర్శించారు. అనంతరం సిపిఐ కార్యాలయంలో మీడియాతో నారాయణ మాట్లాడారు. తెలుగు ప్రజలకు ప్రధాన శత్రువు బిజెపియేనని తెలిపారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను బ్లాక్మెయిల్ చేసి ప్రధాని మోడీ లొంగదీసుకున్నారని విమర్శించారు. బిజెపికి ఆ మూడు పార్టీలూ లొంగిపోవడాన్ని తెలుగు ప్రజలు హర్షించరన్నారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 20న విజయవాడలో నిర్వహిస్తున్న సదస్సుకు జైభారత్ పార్టీనీ ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధమా..?

- జగన్కు బాబు సవాల్
- ఎక్కడైనా, ఏ రోజైనా వస్తా
- ఎవరి పాలన స్వర్ణయుగమో తేలుస్తాం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



బూటకపు ప్రసంగాలు మాని తనతో బహిరంగచర్చకు రావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డికి టిడిపి అధినేత చంద్రబాబునాయుడు సవాల్ విసిరారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనను ఆయన విడుదల చేశారు. 'జగన్తో బహిరంగ చర్చకు నేను సిద్ధంగా ఉన్నా, నాతో చర్చకు వచ్చేందుకు జగన్ సిద్ధమేనా' అని ఆయన ప్రశ్నించారు. జగన్ సిద్ధంగా ఉంటే చర్చలు ఎప్పుడు. ఎక్కడ జరపాలో నిర్ణయించాలని పేర్కొన్నారు. 'ఏ అంశం మీదైనా, ఎక్కడైనా, ఏ రోజైనా నేను సిద్ధమే' అని బాబు పేర్కొన్నారు. 'బూటకపు ప్రసంగాలు, తప్పుడు ప్రచారాలు చేయడం కాదు. దమ్ముంటే బహిరంగ చర్చకు రా.. ఎవరి పాలన స్వర్ణయుగమో, ఎవరి పాలన రాతియుగమో చర్చిద్దాం' అని తెలిపారు. 2019లో ప్రజలు జగన్కు ఇచ్చిన ఒక్క అవకాశం చివరిది కానుందని పేర్కొన్నారు. ఓటమిపై స్పష్టత రావడంతో మళ్లీ ప్రజలను ఏమార్చడానికి పరదాలు కాస్తా పక్కకు జరిపి ఎన్నికల ముందు రోడ్డెక్కారని విమర్శించారు. రూ.10లు ఇచ్చి రూ.100లు దోచిన జగన్ సంక్షేమం గురించి చెప్పడమా? అని ప్రశ్నించారు. సహజ వనరుల దోపిడీతో, స్కాం కోసమే స్కీం పెట్టిన విధానాలతో అత్యంత ధనిక ముఖ్యమంత్రిగా మారిన జగన్కు పేదల జీవితాల గురించి మాట్లాడే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏ మూలన చూసినా జగన్ ఐదేళ్ల విధ్వంస పాలనతో నష్టపో యిన ప్రజలు కనిపిస్తున్నారని పేర్కొన్నారు. జగన్ చెప్పినట్లు రానున్న ఎన్నికల్లో ప్రతి బాధిత కుటుంబం వైసిపిని ఓడించేందుకు స్టార్ క్యాంపెయినర్ కాబోతోందని తెలిపారు. రాయలసీమలోని ప్రయాణికులను ఇబ్బందిపెట్టి ఆర్టీసీ, పాఠశాలల బస్సుల్ని లాక్కొని జనాన్ని బలవంతంగా రాప్తాడు సభకు తరలించారని విమర్శించారు.నిజంగా గురించి ఎన్నికల సమయంలో మాయ మాటలు చెబుతున్నారని విమర్శించారు.

జనసేన అధినేత పవన్ కళ్యాణ్పై తాజాగా కేసు పెట్టాడన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. కేసులు పెట్టినా, దాడులు చేసినా ప్రశ్నించే గళాలను అణిచివేయలేరని, ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని తెలిపారు.

ముగిసిన చంద్రబాబు 'యాగం'

చంద్రబాబు చేపట్టిన రాజశ్యామల యాగం ఆదివారంతో ముగిసింది. ఉండవల్లిలోని తన నివాసంలో సతీసమేతంగా శుక్రవారం ఈ యాగం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యాలయ సిబ్బంది కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

రాజేష్కు జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

అంతర్జాతీయ ఫొటోగ్రఫీ కౌన్సిల్, భారత ఫొటోగ్రఫీ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో ప్రజాశక్తి ఫొటో జర్నలిస్టు విశాఖపట్నానికి చెందిన కె.రాజేష్కు ఉత్తమ ఫొటోగ్రాఫర్ పురస్కారం లభించింది. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా దేశభక్తి నృత్యాలను బంధించి రాజేష్ ఈ పోటీలకు పంపించారు. వందలాది మంది ఫొటోగ్రాఫర్లు పాల్గొన్న ఈ పోటీల్లో రాజేష్ సహా 25 మంది విజేతలుగా నిలిచారని ఫొటోగ్రఫీ అకాడమీ జాతీయ ప్రధానకార్యదర్శి తమ్మ శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. విజేతల ఫొటోలను సావనీర్లో ప్రచురిస్తామని, ధ్రువపత్రం పంపిస్తామని తెలిపారు. రాజేష్కు విశాఖ నగర జర్నలిస్టులు, ఫొటో జర్నలిస్ట్లు అభినందనలు తెలిపారు. రాజేష్ను ప్రజాశక్తి ఎడిటర్ బి తులసీదాస్, సిజిఎం వై అచ్యుతరావు అభినందించారు.




రాజేష్కు పురస్కారం తెచ్చిపెట్టిన ఫొటో ఇదే..

చంద్రబాబు ఫ్లెక్సీకి రక్తాభిషేకం

- అధినేతపై బుద్ధా వెంకన్న అభిమానం

ప్రజాశక్తి - వన్టౌన్ (విజయవాడ)

టిడిపి సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న తన స్వామి భక్తిని వినూత్న రీతిలో ప్రదర్శించారు. చంద్రబాబు ఫ్లెక్సీకి తన రక్తంతో అభిషేకం చేశారు. తన ప్రాణం ఉన్నంత వరకూ చంద్రబాబు వెంటే ఉంటానని ప్రకటించారు. విజయవాడ వన్టౌన్లోని తన కార్యాలయం వద్ద ఉన్న గోడపై సిబిఎన్ జిందాబాద్, నా ప్రాణం మీరే' అంటూ తన రక్తంతో రాశారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న మీడియాతో మాట్లాడుతూ... కొన్ని వాస్తవాలు చంద్రబాబుకి తెలియాలనే ఈ కార్యక్రమం చేపట్టానన్నారు. నాలో ఊపిరి ఉన్నంత వరకు చంద్రబాబు కుటుంబంతోనే నా ప్రయాణమని చెప్పారు. తాను టిడిపికి అనేక ఏళ్లుగా సేవ చేస్తున్నానన్నారు. చంద్రబాబుపై దాడి జరిగిన సందర్భంలో తాను పోరాటం చేశానని తెలిపారు. రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని, పార్టీ కోసం నిలబడే వాళ్లకు అవకాశం ఇవ్వాలని సూచించారు. విజయవాడ వెస్ట్గానీ, అనకాపల్లి పార్లమెంట్గానీ అడుగుతున్నానని చెప్పారు. ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని గతంలో చంద్రబాబుకు, లోకేష్కు చెప్పానన్నారు. చంద్రబాబు వెనుక అసెంబ్లీలో కూర్చోవాలన్నదే తన కోరికని తెలిపారు. కొడాలి నాని, వంశీ, కేశినేని నాని మాదిరిగా కాదని, తనకు టికెట్ ఇవ్వకపోయినా చంద్రబాబు వెంటే ఉంటానని తెలిపారు.



చంద్రబాబు ఫ్లెక్సీకి రక్తం రాస్తున్న బుద్దా వెంకన్న

మంచం పట్టిన నూతక్కి వారి కండ్రిక

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా చేజర్ల మండలం నూతక్కి వారి కండ్రిగలో ప్రజలు జ్వరాలతో వణికిపోతున్నారు. ఇంటికొకరు మంచాన పడుతున్నారు. గత 15 రోజులుగా గ్రామంలో జ్వరాలు విజృంభిస్తుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. జ్వరాలకు తోడు ఒంటి నొప్పులు ఉండడంతో అల్లాడిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందులు వాడినా నయం కావడంలేదని వాపోయారు. ఒకే కుటుంబంలోని వ్యక్తులు రెండు, మూడుసార్లు జ్వరం బారినపడుతున్నారు. కాళ్లు, మొఖం వాపు లక్షణాలతో ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 50 మందికి ఇదే పరిస్థితి ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచాలని, అధికారులు స్పందించి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలందించాలని కోరుతున్నారు.



మోడీకి బుద్ధి చెబుతాం

- స్టీల్ప్లాంట్ ఎస్సి, ఎస్టి ఎంప్లాయిస్ అసోసియేషన్

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కును ప్రయివేటుపరం చేస్తే మోడీ సర్కారుకు తగిన బుద్ధి చెబుతామని స్టీల్ప్లాంట్ ఎస్సి, ఎస్టి ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు హెచ్చరించారు. స్టీల్ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1102వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షల్లో కూర్చున్న వారినుద్దేశించి అసోసియేషన్ నాయకులు బొండా తౌడన్న మాట్లాడారు. విశాఖ ఉక్కును రక్షించుకోవడానికి జరుగుతున్న పోరాటంలో దళిత, గిరిజనులు అధికంగా పాల్గొనాలని కోరారు. ప్రభుత్వ రంగం ఉంటేనే రిజర్వేషన్లు అమలవుతాయన్నారు. విశాఖ ఇంతలా అభివృద్ధి చెందడానికి స్టీల్ప్లాంట్ కారణమని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టే వారిని రానున్న ఎన్నికల్లో ప్రజలు ఓటు అనే ఆయుధంతో ఓడించాలని కోరారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న విజయమ్మ, షర్మిల దంపతులు, ప్రియా తల్లిదండ్రులు

ఘనంగా షర్మిల కుమారుడి వివాహం

హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఎపిపిసిసి) అధ్యక్షులు వైఎస్ షర్మిల కుమారుడు రాజారెడ్డి వివాహావేడుక రాజస్థాన్లోని జోధ్పూర్ ప్యాలెస్లో ఈ నెల 16 నుంచి 18 వరకు ఘనంగా జరిగింది. 16న సంగీత్, 17న హల్దీ, 18న తలంబ్రాలు, విందు వైభవంగా నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఫోటోలను షర్మిల సామాజిక మాధ్యమాల్లో ఆదివారం పోస్టు చేశారు. పెళ్లిలో భాగంగా నిర్వహించిన 'హల్దీ' వేడుక ఫొటోలను శనివారం పోస్టు చేసిన ఆమె ఆదివారం తలంబ్రాలు, ఉంగరాలు మార్చుకునే ఫొటోలను షేర్ చేశారు. భావోద్వేగంతో తన స్పందన తెలియజేశారు. ఒక తల్లిగా తన జీవితంలో మరో సంతోషకరమైన క్షణాన్ని చేరుకున్నట్లు ఆమె తెలిపారు. 'ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన క్షణం రానే వచ్చింది, ఆత్మీయుల శుభాకాంక్షలు, ఆశీర్వాదం, దేవుడి కరుణ. నా కుమారుడి తన జీవితపు ప్రేమ (ప్రియా)తో వివాహం చేసుకున్నందున కొన్ని అద్భుతమైన జ్ఞాపకాలు కలకాలం గుర్తుండిపోతాయి' అని షర్మిల పేర్కొన్నారు. ఈ ఫొటోల్లో నూతన దంపతులు రాజారెడ్డి-ప్రియాతో పాటు వైఎస్ విజయమ్మ, షర్మిల-అనిల్ దంపతులు, కూతురు అంజలి, వధువు అట్లూరి ప్రియా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఉన్నారు. కాగా ఈ వేడుకకు షర్మిల సోదరుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

99శాతం హామీలను నెరవేర్చాం

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేయడం, తరువాత వాటిని అమలు చేయకుండా మాయం చేయడం టిడిపికి పరిపాటిగా మారిందని విమర్శించారు. 2014 ఎన్నికల సమయంలో 600 హామీలు ఇచ్చి వాటిలో పది శాతం కూడా అమలు చేయలేదన్నారు. గత ఎన్నికల ముందు వైసిపి ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశామని వివరించారు. అందుకే ప్రజల్లోకి కాలరెగరేసి వెళ్లి ఓటు అడిగే ధైర్యం వైసిపి నాయకులకు, కార్యకర్తలకు ఉందని అన్నారు. చంద్రబాబుని ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని, అందుకే దత్తపుత్రుడితోపాటు జాతీయ పార్టీలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా పొత్తులు పెట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నాడని విమర్శించారు. జగన్ ఒక్కడినీ ఎదుర్కొనేందుకు తోడేళ్లన్నీ ఏకమై రాబోయే ఎన్నికల్లో ప్రజల ముందుకు రానున్నాయన్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. టిడిపిని గెలిపిస్తే రాజకీయాలకు అతీతంగా ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలన్నింటికీ కోతపెట్టే అవకాశముందని హెచ్చరించారు. చంద్రబాబు హయాంలో రైతులకుగాని, మహిళలకుగాని ఏ మాత్రమూ మేలు జరగలేదని విమర్శించారు. ఒక్క వైఎస్.జగన్ హయాంలోనే సంక్షేమ పథకాలను ఎవరి ప్రమేయం లేకుండా నేరుగా అందుతున్నాయని వివరించారు. వైసిపికి ప్రజలే స్టార్ క్యాంపెయినర్లని అన్నారు. ఈ సభలో రాయలసీమ ప్రాంత మంత్రులు, వైసిపి ఎంపిలు, ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీగా జనసమీకరణ

రాయలసీమ జిల్లాల పరిధిలోని 50 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున జనసమీకరణను వైసిపి చేపట్టింది. లక్షలాది మంది వైసిపి అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు తరలొచ్చారు. అనంతపురం నగరానికి వచ్చే ప్రధాన రహదారులన్నీ వాహనాలతో ట్రాఫిక్ జామ్ అయ్యాయి.

బస్సుల్లేక ప్రయాణికుల ఇక్కట్లు

రాప్తాడు సభకు ఆర్టిసి బస్సులతోపాటు, ప్రయివేటు, ప్రభుత్వ విద్యా సంస్థల బస్సులనూ పెద్ద ఎత్తున వినియోగించారు. రాయలసీమ వ్యాప్తంగా 1520 ఆర్టిసి బస్సులను కేటాయించారు. వీటిలో అనంతపురం జిల్లాకు సంబంధించి 520 ఉన్నాయి. దీంతో, సాధారణ ప్రయాణికులు బస్సుల్లేక ఇక్కట్లు ఎదుర్కొన్నారు. మరోవైపు ప్రయివేటు విద్యా సంస్థల నుంచి కూడా ఒక్క అనంతపురం జిల్లాలోనే 700 బస్సులను వినియోగించారు. రాయలసీమ జిల్లాల పరిధిలో ఆరు వేల వరకు వాహనాలను ఎన్నికల ప్రచార సభ కోసం వినియోగించడంతో అన్నిచోట్లా ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. జాతీయ రహదారి 44ని ఆనుకుని సభ జరగడంతో రెండు గంటలకుపైగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్పై దాడి

సిద్ధం సభలో ఫొటోలు తీస్తున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణను వైసిపి నాయకులు, కార్యకర్తలు చుట్టుముట్టి దాడి చేసి రక్తం కారేలా కొట్టారు. వేసుకున్న చొక్కాను కూడా చింపేసి దాడి చేయడంతో ఒళ్లంతా వాతలుపడ్డాయి. ఆ పక్కనే ఉన్న ఈనాడు, ఇతర ఫొటోగ్రాఫర్లపైనా దాడికి ప్రయత్నించడంతో వారు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదంతా పోలీసుల సమక్షంలోనే జరిగినా నిలువరించే ప్రయత్నం చేయలేదు. తీవ్రంగా గాయపడిన కృష్ణను తొలుత పోలీస్స్టేషన్కు తీసుకువెళ్లారు. అక్కడ నుండి ఆయన సహచరులు అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

ఫొటో గ్రాఫర్పై దాడికి సర్వత్రా ఖండన

- ఫొటోగ్రాఫర్ కృష్ణపై జరిగిన దాడిని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర అధ్యక్షప్రధానకార్యదర్శులు ఎస్ వెంకట్రావు, జి ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ దాడిని తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు అనుమల్ల గంగాధర్, కెఎన్ హరి కూడా తీవ్రంగా ఖండించారు.
- రాప్తాడులో మీడియా ప్రతినిధులపై వైసిపి రౌడీ మూకల దాడి దుర్మార్గం అని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు అన్నారు. ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన మీడియాను జగన్ కక్షతో కూలగొడుతున్నారని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసిపి అవినీతిని వెలికితీసిన వారిపై కక్ష సాధిస్తున్నారని తెలిపారు. దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మరో ప్రకటనలో పేర్కొన్నారు.
- రాప్తాడులో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సభ సందర్భంగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్పై జరిగిన దుర్మార్గమైన దాడిని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. సభకు సంబంధించిన దశ్యాలను చిత్రీకరిస్తున్న ఫొటోగ్రాఫర్ పై విచక్షణ రహితంగా దాడి చేసి కొట్టడం అన్యాయమని పేర్కొన్నారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి దారుణాలు పునరావతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
- జర్నలిస్టుపై దాడికి పాల్పడటం అమానుషమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మరో ప్రకటనలో పేర్కొన్నారు. దాడి జరుగుతున్నా పోలీసులు పట్టనట్లు వ్యవహరించటం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందటానికి ఇదే తార్కాణమని పేర్కొన్నారు.
- ఉద్యోగ బాధ్యతలను, విధులను నిర్వర్తిస్తున్న ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై దాడి చేసి గాయపర్చడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛపై జరిగిన దాడి అని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ పేర్కొన్నారు. కృష్ణపై జరిగిన దాడికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి డిమాండ్ చేశారు.

మోడీ అభివృద్ధి నమూనా విఫలం

- కేరళ తరహా ప్రజా ప్రణాళికే ప్రత్యామ్నాయం
- శ్రీకాకుళం సమగ్రాభివృద్ధి సదస్సులో వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వికసిత్ భారత్, మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ వంటి పేర్లతో మోడీ తీసుకొచ్చిన అభివృద్ధి నమూనా దేశంలో విఫలమైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఎవిఎస్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన శ్రీకాకుళం జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సులో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టి పదేళ్లు కావస్తున్నా, కనీసం ఎలక్ట్రానిక్ చిప్‌ను సొంతంగా తయారు చేసుకోలేని పరిస్థితి ఉందన్నారు. గుజరాత్ నమూనా అంటూ ప్రచారం చేశారని, ఇప్పుడు ఆ రాష్ట్రం నుంచి వలసలు పోతున్న ఎనిమిది వేల మంది కార్మికులు పోలీసులకు పట్టుబడడం మోడీ అభివృద్ధి నమూనాకు అద్దం పడుతోందని ఎద్దేవా చేశారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానన్న మోడీ.. అప్పులు, ఆత్మహత్యలను రెట్టింపు చేశారని విమర్శించారు. మోడీ అభివృద్ధి నమూనా విఫలం కావడంతో 2024 ఎన్నికల్లో లబ్ధి కోసం అయోధ్య రాముని నామం జపం చేస్తున్నారని దుయ్యబట్టారు. దేశంలో మానవాభివృద్ధి సూచీలో కేరళ ప్రథమ స్థానంలో ఉందని, కేరళలో వామపక్ష ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజా ప్రణాళికే అభివృద్ధికి సరైన ప్రత్యామ్నాయమని పేర్కొన్నారు. ఎలక్టోరల్ బాండ్లు స్వీకరించడం ఒక పెద్ద కుంభకోణమని, మోడీ అందులో మునిగిపోయారని తెలిపారు. ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేస్తేనే ప్రజాస్వామ్యం బతికిబట్టకట్టదని చెప్పారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా బిజెపి రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి కుదరకపోతే మూసేయడానికి సిద్ధపడుతోందని తెలిపారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తోన్న బిజెపిని వైసిపి, టిడిపి పార్టీలు పల్లెత్తు మాట అనకపోవడం దారుణమన్నారు. హైదరాబాద్‌లోని ఆస్తులన్నీ తెలంగాణకు అప్పగించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఇప్పుడు హైదరాబాద్ రాజధాని కావాలంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్నికలు వస్తుండడంతో ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి, ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టడానికి హైదరాబాద్ రాజధాని అంశాన్ని తెర పైకి తెచ్చారన్నారు. ప్రభుత్వ విద్యా రంగం బలోపేతం, నిష్ణాతులైన ఉపాధ్యాయులను తయారు చేయాల్సిన ముఖ్యమంత్రి బైజూస్, ఎడెక్స్ వంటి ప్రయివేట్ కంపెనీలకు చీఫ్ మార్కెటింగ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేవలం నగదు బదిలీ పథకాలతోనే అభివృద్ధి జరగదని, ప్రజల ఆదాయాలు పెరగవని చెప్పారు. నగదు బదిలీతో జనం తొలుత కొంత ఆదరించినా, కరెంట్ ఛార్జీల పెంపు, ప్రజలపై పలు రకాల పన్నుల భారం మోపడంతో 2024 నాటికి జగన్‌మోహన్‌రెడ్డి ఫెయిల్యూర్ సిఎంగా నిలిచారని వివరించారు. అనంతరం 'విద్య-వైద్యం' అనే అంశంపై పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ ముఖ్య వక్తగా మాట్లాడారు. 'పారిశ్రామికీకరణ-ఉపాధి అవకాశాలు'పై జివిఎంసి కార్పొరేటర్ బి.గంగారావు, 'వ్యవసాయం, నీటి ప్రాజెక్టులు'పై నీటిపారుదల విశ్రాంత చీఫ్ ఇంజనీర్ ఉప్పలపాటి నారాయణరాజు ప్రసంగించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సుప్రీంకోర్టు ఆదేశాలు పాటిస్తాం

- ఎన్నికల బాండ్లపై సిఇసి

న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటిస్తామని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిన తర్వాత ఎన్నికల సంఘం స్పందించడం ఇదే మొదటిసారి. మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ పథకాన్ని ఉపయోగించుకొని వివిధ రాజకీయ పార్టీలకు విరాళాలు అందించిన దాతల పేర్లు బయటపెట్టాలని ఎస్‌బిఐని న్యాయస్థానం ఆదేశించింది. పథకాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషించిన ఆర్థిక మంత్రిత్వ శాఖ కానీ, ప్రధాని కార్యాలయం కానీ కోర్టు తీర్పుపై ఇప్పటి వరకూ స్పందించలేదు. 'పారదర్శకంగా వ్యవహరిస్తామని సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశాం. ఇప్పుడు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశానుసారం చర్యలు తీసుకుంటాం' అని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ చెప్పారు. కోర్టు తీర్పును పరిశీలిస్తున్నామని, దానిని సవాలు చేయాలా వద్దా అనే విషయంపై ఓ నిర్ణయం తీసుకుంటామని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ తెలిపారు.

జార్ఖండ్‌లోనూ కులగణన

రాంచీ : బీహార్ తరహాలో జార్ఖండ్‌లో కూడా కులగణన నిర్వహించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంపయీ సొరేన్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. సర్వేకు సంబంధించి ముసాయిదాను రూపొందించాలని, దానిని ఆమోదం నిమిత్తం క్యాబినెట్ ముందు ఉంచాలని ఆయన ఆదివారం సంబంధిత శాఖను ఆదేశించారు. అంతా ఓ ప్రణాళిక ప్రకారమే జరుగుతుందని, లోక్‌సభ ఎన్నికల తర్వాత కులగణన ప్రారంభమవుతుందని ఓ అధికారి తెలిపారు. 'జనాభా ఎక్కువగా ఉంటే వాటా అధికంగా వస్తుంది. బీహార్ సిద్ధంగా ఉంది' అంటూ సొరేన్ అంతకుముందు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు. బీహార్ తరహాలోనే జార్ఖండ్‌లో కూడా కులగణన నిర్వహిస్తారు. బీహార్‌లో గత సంవత్సరం జనవరి 7వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ సమాచార సేకరణ జరిగింది.

అడవిలో గున్న ఏనుగు మృతి

ప్రజాశక్తి- చంద్రగిరి (తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం కూచువారిపల్లి (భీమవరం) అటవీ ప్రాంతంలో ఏడాది వయసుగల గున్న ఏనుగు మృతదేహాన్ని ఆదివారం ఫారెస్ట్ అధికారులు గుర్తించారు. అటవీ ప్రాంతలో కూంబింగ్ నిర్వహిస్తున్న అటవీ శాఖ అధికారులకు ఏనుగు కళేబరం కనిపించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. గత 20 రోజులుగా సుమారు 18 ఏనుగుల గుంపు యల్లంపల్లి పరిసర ప్రాంతాల్లో పంట పొలాలపై దాడులు చేస్తున్నాయి. ఏనుగులు పొలాలపై దాడులు చేయకుండా నివారించేందుకు అటవీశాఖ సిబ్బంది కూంబింగ్ నిర్వహించారు. భీమవరం అటవీ ప్రాంతంలో గున్న ఏనుగు కళేబరాన్ని గుర్తించారు. సమాచారం తెలుసుకున్న డిఎఫ్‌ఒలు సతీష్ రెడ్డి, శివకుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతి చెందిన గున్న ఏనుగు ఆ గుంపునకు చెందినదిగా భావిస్తున్నారు. తల్లి నుంచి విడిపోయిగానీ, అనారోగ్యంతోగానీ మరణించి ఉండవచ్చని తెలిపారు. పది రోజులు క్రితమే మరణించి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏనుగు కళేబరానికి అడవిలోనే పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలియజేస్తామని డిఎఫ్‌ఒ సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ పరిశీలనలో ఎఫ్‌ఆర్‌ఒ దత్తాత్రేయ, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్

నిర్బంధం నుంచి నూతన ఆలోచనలకు నాంది

- లెనిన్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలి
- పుస్తకావిష్కరణలో రాంభూపాల్

ప్రజాశక్తి-కదిరి టౌన్

లెనిన్ తన చిన్న వయసులోనే ప్రజహితం కోసం జైలుకెళ్లారని, అక్కడ నిర్బంధం అనుభవిస్తూనే ప్రజాక్షేమం కోసం నూతన ఆలోచనలకు నాంది పలికారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో ఎల్‌ఐసి అభివృద్ధి అధికారి పిళ్లా కుమారస్వామి రచించిన "లెనిన్ నేడు లేడు.. చూడు జనంలో ఉన్నాడు..!' పుస్తకాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ.. లెనిన్ జీవించిన కాలమంతా పీడిత ప్రజల కోసం పని చేశారన్నారు. కారల్‌మార్క్స్ రచించిన సిద్ధాంతాన్ని ఆచరణలో చూపెట్టిన మహనీయుడని కొనియాడారు. పీడిత ప్రజల కోసం పెట్టుబడిదారి, భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు నిర్వహించి రష్యాలో విప్లవాన్ని సాధించారని గుర్తు చేశారు. ఏ పదజాలం వెనుక ఏ వర్గ ప్రయోజనం ఉంటుందో తెలుసుకోలేనంత కాలం ప్రజలు మోసపోతూనే ఉంటారని ఆయన చెప్పిన మాట ఇప్పటికీ మన కంటికి కనిపిస్తూనే ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు నడుస్తున్నాయని తెలిపారు. లెనిన్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ప్రజా హితం కోసం ముందుకు సాగాలని కోరారు. లెనిన్ కృషిని పుస్తక రూపంలో తీసుకురావడంలో రచయిత పిళ్లా కుమారస్వామి తీసుకున్న చొరవ అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత పిళ్లా కుమారస్వామి, వామపక్ష పార్టీ నాయకులు సుబ్బిరెడ్డి, జిఎల్.నరసింహులు, రాజేంద్ర, రమణ, రామకష్ణ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి- తిరుపతి సిటీ:

పాలిటెక్నిక్ విద్యార్థిని హాస్టల్ గదిలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన తిరుపతి శ్రీవెంకటేశ్వర అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం వేణుగోపాల్ పురానికి చెందిన టి శశి (17) పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతోంది. యూనివర్సిటీలోని ప్రియదర్శిని హాస్టల్లో మొదటి అంతస్తులో మరో ముగ్గురు విద్యార్థులతో కలిసి ఆమె ఉంటోంది. ఇటీవల జరిగిన పరీక్షల్లో అన్ని సబ్జెక్టులలో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైంది. తోటి విద్యార్థులు అర్ధరాత్రి వరకు చదువుకొని ఆదివారం ఉదయం నిద్రలేచేసరికి శశి ఫ్యాన్‌కి ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించింది. వెంటనే విద్యార్థులు కేర్ టేకర్ కుమారికి సమాచారం ఇచ్చారు. హాస్టల్ సిబ్బంది ద్వారా విషయం తెలుసుకున్న ప్రిన్సిపల్ వి రమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి రూరల్ పోలీసులతో పాటు మహిళ ఎస్ఐ అరుణ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విషాదపట్నంగా.. విశాఖ

- శంఖారావం సభల్లో నారా లోకేష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్, గోపాలపట్నం (విశాఖపట్నం)

జగన్ హయాంలో విశాఖపట్నం.. విషాదపట్నంగా తయారైందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. విశాఖ తూర్పు, దక్షిణ, పశ్చిమ నియోజకవర్గాల్లో ఆదివారం జరిగిన టిడిపి శంఖారావం సభల్లో ఆయన మాట్లాడారు. విశాఖను తమ హయాంలో జాబ్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా మారిస్తే జగన్ గంజాయి క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా మార్చారని ఎద్దేవా చేశారు.



ప్రజలను గంజాయికి బానిసలను చేసి వైసిపి ప్రభుత్వం లక్షల కుటుంబాలను నాశనం చేస్తోందని ఆరోపించారు. అప్పట్లో నెలకో ఐటి కంపెనీ విశాఖకు రాగా.. నేడు దానికి భిన్నంగా నగరం మారిపోయిందన్నారు. భూకబ్జాలు, కిడ్నాప్‌లు, మర్డర్లు విపరీతంగా పెరిగాయని తెలిపారు. సాక్షాత్తు విశాఖ ఎంపి కుటుంబ సభ్యులే కిడ్నాపర్ల బారిన పడ్డారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. విశాఖలో వైసిపి నాయకుల భూకబ్జాలకు అడ్డుపడ్డారనే కారణంతోనే తహశీల్దార్ రమణయ్యను కొందరు కిరాతకంగా చంపేశారని ఆరోపించారు. జగన్ హయాంలో ఇంటి, చెత్త పన్నులు, ఆర్‌టిసి ఛార్జీల భారాలు ప్రజలపై విపరీతంగా పడ్డాయన్నారు. నిత్యావసరాల ధరల పెరుగుదలకు అడ్డుకట్ట వేయలేకపోయారని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ భూములను కొట్టేయడానికి వైసిపి నేతలు చూస్తున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే విశాఖ ఫిషింగ్ హార్బర్‌ను ఆధునికీకరిస్తామని, వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం కాకుండా చూస్తామని ప్రకటించారు. ఉమ్మడి విశాఖలో మూతపడిన సుగర్ ఫ్యాక్టరీలను హామీ ఇచ్చారు. ఆయా చోట్ల జరిగిన సభల్లో టిడిపి ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గండి బాబ్జీ, జనసేన అర్బన్ జిల్లా అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉద్యోగం మీ సొంతం

- గ్రూప్-2 అవగాహన సదస్సులో కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

గ్రూప్-2 పరీక్ష రాసే అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉద్యోగం సొంతం చేసుకోవచ్చని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. గుంటూరు ఎసి కాలేజీలో ఆదివారం డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గ్రూప్-2 అభ్యర్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై కృష్ణకాంత్ అధ్యక్షతన జరిగిన సభలో పోటీ పరీక్షల కోసం రూపొందించిన 'భారత సమాజం' అనే పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి మోజేస్, 'ఆంధ్రుల చరిత్ర-ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ' అనే పుస్తకాన్ని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు ఆవిష్కరించి అభ్యర్థులందరికీ ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణరావు, పాశం రామారావు, కాలేజి ప్రిన్సిపల్ పి మోజేస్ తదితరులు ప్రసంగించారు.



సింహపురి బాలోత్సవంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఉత్సాహం.. ఉత్తేజభరితం..

- ముగిసిన సింహపురి, గుంటూరు బాలోత్సవాలు

ప్రజాశక్తి-నెల్లూరు/గుంటూరు

గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో జరుగుతున్న బాలోత్సవాలు ఉత్సాహభరితంగా సాగాయి. రెండు రోజుల పాటు జరిగిన బాలోత్సవాలు ఆహూతులను ఆలోచింపజేశాయి. చివరి రోజైన ఆదివారం ముగింపు సందర్భంగా విద్యార్థులు చేపట్టిన కోలాటం, జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, పాటల పోటీలు, ఏకపాత్రాభినయం, బృందగానం ప్రేక్షకులను ఆకట్టు కున్నాయి. నిత్యం చదువుల్లో మునిగితేలే విద్యార్థులకు ఈ బాలోత్సవాలు వారిలో ఉత్తేజాన్ని నింపాయి.

గుంటూరు హిందూ కాలేజీ ప్రాంగణంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన గుంటూరు జిల్లా బాలోత్సవంలో ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బాలోత్సవాలను మరింత విస్తృతంగా పట్టణ ప్రాంతాల్లోనూ నిర్వహించటానికి కృషి చేస్తామని తెలిపారు. పిల్లల్లో సృజనాత్మకతను, నైపుణ్యాలను వెలికి తీయటానికి ఇటువంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మలినేని విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు, కిట్స్ ఇంజనీరింగ్ కాలేజి చైర్మన్ కోయి సుబ్బారావు, కాటూరి పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ నూతలపాటి వీరప్రకాష్ తదితరులు మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థులను సమీకరించి, వారిలో నైపుణ్యాలను వెలికి తీయటానికి జెవివి చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. దీప్తి పబ్లికేషన్స్ అధినేత ఎ.ఆంజనేయులు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ ప్రసంగించారు. నెల్లూరు నగరంలోని శ్రీ కస్తూరిదేవి బాలికల హైస్కూల్ ప్రాంగణంలో 'సింహపురి బాలోత్సవం' నిర్వహించారు. ముగింపు సందర్భంగా యుటిఎఫ్ నాయకులు ఎంవి చలపతి అధ్యక్షతన జరిగిన సభలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ఆహ్లాదకరమైన వాతావరణంలో బాలోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. విశిష్ట అతిథులుగా సంఘమిత్ర స్కూల్స్ కరస్పాండెంట్ కె.వి రవీందర్ రెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎన్.నవకోటేశ్వరరావు, యుటిఎఫ్ నాయకులు పాల్గొని విద్యార్థులకు సందేశమిచ్చారు.



బీచ్ రోడ్డులో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

భూ యాజమాన్య హక్కుల చట్టంపై న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి- కలెక్టరేట్, లీగల్ రిపోర్టర్ (విశాఖ)

దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూ యాజమాన్య హక్కుల చట్టం-2022ను తీసుకురావడాన్ని నిరసిస్తూ న్యాయవాదులు ఆదివారం విశాఖ బీచ్ రోడ్డులో నిరసన ప్రదర్శన చేశారు. ఆర్‌కె.బీచ్ నుంచి వైఎంసిఎ వరకు ఈ ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా విశాఖపట్నం బార్ అసోసియేషన్ స్టీరింగ్ కమిటీ చైర్మన్, సీనియర్ న్యాయవాది బెవర సత్యనారాయణ మాట్లాడుతూ ఈ చట్టం ప్రకారం రెవెన్యూ, ప్రత్యేక అధికారులు స్థిరాస్తుల కేసులను పరిష్కారిస్తారని, దీనిపైన టైటిల్ అథారిటీ, అప్పిలేట్ అథారిటీ ఉంటుందని, అప్పటికీ న్యాయం జరగకపోతే హైకోర్టు వారికి రివిజన్ పవర్ ఇస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో సివిల్ కోర్టుల్లో స్థిరాస్తుల కేసులు పరిష్కరించే అవకాశం లేదన్నారు. ఆస్తి తాకట్టు పెట్టాలన్నా, అమ్మాలన్నా, గిఫ్ట్ రాయాలన్నా టైటిల్ రిజిస్టర్ అథారిటీ అనుమతి ఉండాలని, దేశంలో అత్యున్నత న్యాయస్థానాలు చెప్పిన తీర్పులను కూడా టైటిల్ రిజిస్టర్ అధికారి ధ్రువీకరించాల్సి ఉంటుందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని వివరించారు. రాష్ట్రంలో సుమారు 66 శాతం కేసులు స్థిరాస్తులకు సంబంధించినవేనని తెలిపారు. ఈ చట్టంపై పరిజ్ఞానం లేని రెవెన్యూ లేదా ప్రత్యేక అధికారులు ప్రజలకు ఏ విధంగా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో విశాఖపట్నం న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి పైల శ్రీనివాసరావు, ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ విశాఖ యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లు సురేష్, ఎన్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజమండ్రి ఎంపిగా ఆఫర్ వచ్చింది :సుమన్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

వైసిపి, తెలుగుదేశం పార్టీల నుంచి రానున్న ఎన్నికల్లో రాజమండ్రి ఎంపిగా పోటీ చేయాలని ఆఫర్లు వచ్చినట్లు సినీ నటుడు సుమన్ వెల్లడించారు. ఆదివారం తిరుపతి తాతయ్యగుంట గంగమ్మను ఆయన దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రాజకీయాల్లో చంద్రబాబు తనకు గురువని చెప్పారు. రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో టిడిపి, వైసిపిల నుంచి తనను పోటీ చేయాలని అవకాశం వచ్చినట్లు తెలిపారు. ఇప్పుడే ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలన్న ఆలోచన లేదన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలకు మేలు చేసే మేనిఫెస్టోకే తన మద్దతు ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులకు, యువతకు, మహిళలకు, రైతులకు మేలు చేసే మేనిఫెస్టో ఉండాలని సూచించారు. మేనిఫెస్టో రూపొందించిన పార్టీలు వాటిని సాధ్యాసాధ్యాలు పరిశీలించకుండా హామీలు ఇవ్వడం తగదన్నారు. రాష్ట్రంలో యువత గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడకుండా వారిని కట్టడి చేసేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. యువతకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు.



"మానవుల తొలి దినాల సౌందర్యానంద చర్యల్లో కవిత్వం ఒకటి. అది జీవన కార్యకలాపంలోనుంచి ఉద్భవించే ఒక వ్యక్తీకరణ. అందుకనే జీవితానికి అతీతంగా ఉండడం దాని సహజ లక్షణం కాదు."

– క్రిస్టోఫర్ కాడ్వెల్

ఇప్పుడే చూశాడు అసలు శత్రువుని!

రైతు ఇప్పటివరకూ
తనపై యుద్ధం చేసే వాళ్ళనే చూశాడు
ఇప్పుడే చేయించే వాడిని కనిపెట్టాడు

మొలకెత్తే విత్తులో
కల్తీల కన్నీళ్ళలో
సత్తువనిచ్చే ఎరువులో
కడకు పురుగుల చంపలేని
మందుల కొనుగోళ్ళలో
మోసకారి వ్యాపారినే శత్రువుగా చూశాడు
ఇప్పుడే .. ఇప్పుడే చూశాడు
వాడికి ప్రాణం పోసిన పాలకుడిని !

ఆరుగాలం కష్టం
మడిలో పంట తడిలో
కలుపు పెరికేతలో
కోసిన పంట ఊడ్పులో
కరిగి ఇంకిన చెమట ధర
కార్పొరేటోడు కైంకర్యం చేస్తే
వాడే తన హంతకుడనుకున్నాడు
ఇప్పుడే .. ఇప్పుడే చూశాడు
వాడికి ప్రాణం పోసిన పాలకుడిని!

అందుకే .. అందుకేనేమో
దుకాణాలు మార్కెట్లపై పోరే చాలదని
వాళ్ళకు ప్రాణం పోసే
పాలకుడి మీదికే కదం తొక్కాడు
పార్లమెంటు చట్టాలతోనే తలపడ్డాడు

నిన్నటిదాకా దేశ రక్షకులంటే
జై కిసాన్, జై జవానన్న పాలకులు
ఇప్పుడు ముసుగు తీసేశారు
జై కార్పొరేట్, జై జవాన్ రూపాన్ని
దేశం ముందు ఆవిష్కరించారు
కిసాన్ మీదకు జవాన్ను తోలిన
కసాయి రూపం ప్రదర్శించారు
ప్రజల కంటే ముందు అక్షరంలేని
రైతు కూడా శత్రు జాడ చూశాడు
శత్రువులెవరో ప్రజలే చూడాలిక !

అందుకే రైతు ఇనుప మేకులు తొక్కేస్తూ
పెల్లెట్ల గాయాలు తట్టుకుంటూ
నీటి ఫిరంగు తరంగాలు దాటి
కేంద్రంపైనే యుద్ధం ప్రకటించాడు
ఇప్పుడు అక్షరం నేర్చిన సకల జనాలే
రైతుతో కలిసి బతుకు పోరు చేస్తారో
కార్పొరేట్ కింద నలిగి చస్తారో
తెలుసుకోవాలి .. తేల్చుకోవాలి!

– ఉన్నం వెంకటేశ్వర్లు

రైతు జీవితం ఓ చిత్రవధ

లోకానికి
అన్నం పెట్టేవాడు
ఆకలితో వీధి కాళ్ళ పట్టుకున్నాడు.
పొలాన్ని ఏలే రాజు
ఆత్మ గౌరవం
పాలకుల వంచనకు బలైంది.
మట్టిని చెమటతో తడిపి
బంగారాన్ని పండించిన చేతులకు
సంకెళ్లు వేశారు.
సమస్త సంతోషాలకు
మూలమైన జీవితాలు
అనాథలుగా మారాయి
దేశానికి వెన్నుముకైన
రైతు జీవితాన్ని
ఓ ప్రశ్నగా మార్చి చిత్రవధ చేస్తున్నారు!

– చందలూరి నారాయణరావు
97044 37247

చిక్కనవుతున్న శూన్యం

సాయంత్రం యథాలాపంగా
పక్షులన్నీ గూటికి చేరుకున్నాయి
గొర్రెమందలో పిల్లలు తల్లుల్ని సరిగానే వెతుక్కుని
ఆనందంతో గెంతుతున్నాయి
రాత్రి పడుతున్న కొద్దీ చీకటి చిక్కనౌతూ
నక్షత్రాలు మరింత
క్రాంతివంతంగా మెరుస్తున్నాయి
గుడిసెలో దీపం గుడ్డిగా వెక్కిరించినట్టు
వెలుగుతుంది
గాలికి పూనకం వచ్చినట్టు చెట్లు
తల విరబోసుకు ఊగుతున్నాయి!

ఏదీ మారలేదు
ప్రతి రాత్రి దూరంగా వినిపించే నక్కల ఈలలు
తీతువుల అరుపులతో సహా
ఏదీ మారలేదు
ఈ రాత్రి
ఏది కొత్తగా లేదు
మిగతా ప్రపంచం అంతా యథావిధిగానే ఉంది
గాలి వీయటం మానలేదు
దిక్కులన్నీ ఒకటి కాలేదు
దిగంతాలు దద్దరిల్ల లేదు
పిల్లను వదిలి తల్లి కోడిని ఎత్తుకుపోయిన
రక్కసి కాలం
అమ్మ పోయినట్టు
ఎంతమందికి తెలుసు ఊరిలో
చుట్టుపక్కల నాలుగి ళ్లకు కాకుండా ...
అంతేలే పేదల చావులు వేదమంత్రాలు కావు
మట్టి విగ్రహాలైనా కాదు... ఊరేగడానికి
ఊరంతా వినిపించడానికి ..!

– లోసారి సుధాకర్.
99499 46991

సిగ్గు పడుతున్నాను

భావపరంపర సెలయేరులో
సాయంత్రం ఒక టీకప్పును ఇద్దరు మిత్రులు
పంచుకున్నారు
సిరివెన్నెల రసవాహినిలో
రాత్రిపూట ఒక పూలపాన్పును
ఇద్దరు ప్రేమికులు పంచుకున్నారు
కరువు తాండవంతో
ఆకలి గాయాల్ని మాన్పుకోవడానికి
ఒక రొట్టెముక్కను
ఇద్దరు బిచ్చగాళ్లు పంచుకున్నారు

ఇది స్నేహితుల ధరణిగా గొప్పగా అనుకున్నాను
ఇది ప్రేమికుల ధరిత్రిగా
ఉన్నతంగా ఊహించుకున్నాను
కానీ, పస్తులే ఆస్తులైన అవనిగా
సిగ్గుపడుతున్నాను

– కోటం చంద్రశేఖర్
94920 43348

ట్రోలింగ్.. ఒక సామాజిక సమస్య!

పుస్తకం

మన దేశంలో మనుషులకు ఉండే స్వేచ్ఛ వారు దేనిని ప్రశ్నించనంతవరకే అని, ఆ ప్రశ్నలు సూటిగా తగలాల్సిన చోట తగిలినప్పుడు, నియంతృత్వ ధోరణి ఎలా విరుచుకుపడుతుందో చెప్పే ఒక విధ్వంసర క్రీడే 'ట్రోలింగ్'. ఈ 'ట్రోలింగ్' బారిన పడిన 15 మంది స్త్రీల కథనాలను 'ట్రోల్ ప్రశ్నించే స్త్రీల అనుభవ కథనాలు పేరుతో పుస్తకంగా తీసుకువచ్చింది 'ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక' (ప్రరవే). ఈ అంశం మీద ప్రరవే ఏడవ మహాసభల్లో రెండు రోజుల సమావేశాలు కూడా జరిగాయి. 'ట్రోలింగ్' నిజానికి సాధారణ అంశం కాదు; ఒక వ్యక్తిలోని ధైర్యాన్ని, శీలాన్ని, నైతికతను, విలువలను హత్య చేయడానికి; భయపెట్టడానికి, బాధపెట్టడానికి ఎక్కుపెట్టబడుతున్న ఒక 'టాక్సిక్ వెపన్' అని ఈ కథనాలు చదివితే అనిపిస్తుంది.

ఈ 15 మంది స్త్రీలూ కులం, జెండర్, మత మైనారిటీల సమస్యలపై పని చేస్తున్నవాళ్ళు. వివక్షారహిత లోకాన్ని ఆకాంక్షిస్తున్న వాళ్ళు. ప్రజాస్వామిక భావ చైతన్య ప్రసారానికి అవరోధం అవుతున్న వాటిని తొలగించుకుంటూ పోవాలని ఆశిస్తున్న వాళ్ళు. అందుకొరకే మాట్లాడుతున్న వాళ్ళు, రాస్తున్న వాళ్ళు, సృజన సాహిత్యకారులు, పత్రికా రచయితలు, క్షేత్రస్థాయి కార్యకర్తలు.

అరుణ గోగులమండ కథనంలో – "వివక్షా రహిత లోకాన్ని కోరుకున్న ఓ విద్యావంతురాలిని... తన జీవితాన్నే తానే నిర్మించుకున్న ధృఢమైన స్త్రీని సాటి స్త్రీలు, కుల పెద్దలు సైతం ఎలా ట్రోల్ చేస్తూ, తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించే ప్రయత్నంతో పాటు, తమ హేళన భావాన్ని ఆమె చుట్టూ ఉన్న ఆవరణలో ఎలా ప్రతిధ్వనించేలా చేశారో వివరించారు. దృఢంగా ఉండే వ్యక్తుల మీద ఏదో ఒక రూపంలో దాడులు ఎలా కొనసాగుతూ ఉంటాయో అరుణ మాటల్లో అర్థమవుతుంది. రాఘవేంద్రరావు సినిమాల్లో స్త్రీ చిత్రీకరణ గురించి, సంసారాల్లో స్త్రీలపై అట్టడుగు వర్గాల స్త్రీలపై ఎంత హింస దాగి ఉంటుందో అన్న అంశం గురించి, పురాణాల్లో స్త్రీలపై హింస, వ్యక్తిత్వ హననం వంటి అంశాలపై రాసినందుకు ట్రోలింగ్ జరగడం ఒక కోణం. కులం గురించి కనుక్కుని, ఆ కులం వారు ఓన్ చేసుకోవడం జరిగినా, పితృస్వామ్య ధోరణులపై వ్యతిరేకత వ్యక్తం చేస్తే ఆ కులపెద్దల నుంచి అందరూ దారుణంగా ట్రోల్ చేయడం ఇంకో కోణం. ఇద్దరు పిల్లలను పెంచుకుంటూ, ఒంటరిగా ధైర్యంగా సాగిపోతున్న స్త్రీని 'ఈజీ ప్రే' గా చూసే మగవాళ్ళు, వ్యక్తిత్వ–శీల హత్య చేయడం... ఇవన్నీ కూడా ట్రోల్ రూపాలే. "పురుషులు స్త్రీలకు ఇన్సెంటివ్స్ ఇవ్వడానికి ఇష్టపడతారు తప్ప, గౌరవం ఇవ్వడానికి ఒప్పుకోరు" అని ఓ చోట అరుణ రాశారు. ఆలమూరు సౌమ్య తన అనుభవాలు రాస్తూ, 'సహానుభూతి లేని వాతావరణంలో ట్రోలింగ్ జరుగుతుంది. ట్రోలింగ్‌కు కారణం అహంకారం. ముఖ్యంగా కులాహంకారం, పురుషహంకారం. సామాజికంగా బలమైన కులం నుంచి వచ్చిన అమ్మాయిగా కులాహంకారాన్ని ఎదుర్కోలేదు కానీ పురుషహంకారాన్ని మాత్రం ఎదుర్కున్నాను' అని పేర్కొన్నారు. ఆర్థిక స్వాతంత్ర్యం, ఆత్మీయుల బలం వల్ల తాను ట్రోలింగ్‌కు వ్యతిరేకంగా నిలబడగలిగానని చెప్పారు.

'చైతన్య మహిళా సంఘం'లో పనిచేస్తున్న కాగుల శ్రీదేవి, 'సత్యాన్ని చెప్పడం కూడా ఒక యుద్ధం లాంటిదే' అంటారు. సోనియా గాంధీ మీద కొందరు అసభ్యకరమైన రాతలు రాసినప్పుడు, ఆది పురుష్ సినిమా గురించి రాసినప్పుడు ట్రోలింగ్‌కు గురైన శ్రీదేవి సోషల్ మీడియాలో మిత్రులైన వారు కూడా మద్దతుగా నిలబడకపోవడం వల్ల, దానిని అనివార్య చర్యగా భావించకపోవడం వల్ల ఈ ట్రోలింగ్ మితిమీరిపోతుందని' రాశారు. "గౌరవం పొందడం నా హక్కు. నా హ్యూమన్ డిగ్నిటీని అవమానపరిచే హక్కు ఎవరికి లేదు" అంటారు కె.ఎన్.మల్లీశ్వరి. 'మతమంటే మొగుడే కదా?' అన్న శీర్షికతో బ్లాగులో రాసినందుకు, 'కొత్త స్త్రీలు వస్తున్నారు జాగ్రత్త' అన్న కాలమ్ సాక్షిలో రాసినప్పుడు, 'నీల' నవల విషయంలో, 'ప్రరవే' విషయంలో ఇలా అనేక అంశాల్లో ట్రోలింగ్ ఎదుర్కున్న మల్లీశ్వరి, 'భాషలో, భావంలో ప్రజాస్వామికత చూపనివారు మిత్రులైనా సరే గట్టిగా వ్యతిరేకించాలి' అంటారు. 'ఈ ట్రోలింగ్‌ను అరికట్టాలంటే ఎంత చిన్నగా అయినా సరే మన నిరసనను రికార్డు చేయటం అవసరం. సమిష్టి కార్యాచరణ చాలా ముఖ్యం.' అంటారు సామాజిక ఉద్యమకారిణి సజయ. సనాతన ధర్మం మహిళలకు ఎంత ప్రమాదమో, ఇండియా–పాకిస్తాన్ మధ్య సృష్టించబడే యుద్ధాల వెనుక ఉండే వ్యూహాల గురించి రాసినప్పుడు ట్రోలింగ్‌కు గురైన కొండవీటి సత్యవతి, 'భయపట్టి మనల్ని ఆపాలనుకునే ట్రోలర్స్ మూర్ఖత్వాన్ని మనం ఆపకుండా రాస్తూ, వారిపై చట్టపరమైన చర్యలు ఎప్పటికప్పుడు తీసుకుంటూ ఉండటం వల్లే అడ్డుకోగలము' అని స్పష్టంగా తన కథనంలో చేశారు.

పురుషాధిక్యత, ముస్లిం అస్తిత్వం వల్ల కూడా ట్రోలింగ్‌కు గురయ్యే సందర్భాలను ఇందులో కథనంగా చెప్పారు ఖాలీద పర్వీన్. పెయిడ్ ట్రోలింగ్ గురించి, మతపరమైన దాడుల గురించి గురించి చెబుతూనే, ప్రభుత్వం చిత్తశుద్ధితో వీటిని అరికట్టే దిశలో పని చేయాలని అంటారు. ఇండిపెండెంట్ జర్నలిస్టుగా తన యూట్యూబ్ చానల్‌తో కొనసాగుతున్న తులసి చందు... తెలంగాణలో నిరుద్యోగం, మతం పేరుతో ఓట్లడిగే నాయకుల ధోరణిని వ్యతిరేకించినందుకు, రైతుల పోరాటానికి మద్దతుగా మాట్లాడినందుకు, ఇంకా అనేక అంశాల్లో ట్రోలింగ్ ఎదుర్కొన్నారు. ట్రోల్స్‌ను ఎదుర్కోవడానికి ఒక మార్గం వాటిని పట్టించుకోకపోవడం అని రాశారు.

తెలంగాణ వుమన్ ట్రాన్స్ జాయింట్ యాక్షన్ కమిటీలో సభ్యురాలిగా ఉంటూ, క్వియర్ నెస్ గురించి మాట్లాడినందుకు, వివిధ లైంగిక ఆసక్తులను సమాజం గౌరవించాలని పోరాటం చేస్తున్నందుకు సోషల్ యాక్టివిస్ట్ దీప్తి సిర్ల కూడా ఎంతో ట్రోలింగ్‌కు గురయ్యారు. ఈ విషయంలో ట్రోలర్స్ విజంభణ స్థాయి అధికంగా ఉంటుంది. ఈ కథనంలో స్త్రీలు తమ వైవిధ్యతను గురించి మాట్లాడుకోవడం కోవడం కూడా ఎలా వారిపై ఇంత విషం కక్కేలా చేస్తుందో వివరించారు. 'అశ్లీలత ఆధిపత్యపు వికృత లక్షణంగా ట్రోలింగ్ రూపంలో ఎలా బయటపడుతుందో, ట్రోలింగ్ టెక్నాలజీ చీకటి రూపంగా, సైన్సు టెక్నాలజీపై ఆధిపత్యపు పట్టుకు ఆధునిక నిదర్శనంగా ఎలా మారిందో సాంస్కృతిక కార్యకర్త దేవి తన కథనంలో స్పష్టం చేశారు. స్త్రీల మత స్వేచ్ఛ గురించి, నోట్ల రద్దు సమయంలో ప్రజల ఇబ్బందుల గురించి రాసినందుకు విపరీతమైన ట్రోలింగ్‌కు గురైన కవయిత్రి, నాటకకర్త మెర్సీ మార్గరెట్... ఈ ట్రోలింగ్‌ను ఎదుర్కోవాలంటే, 'పాఠశాలల్లో ఈ సామాజిక మాధ్యమాలను వాడే విధానం గురించి చెప్పాలని' అంటారు. ఈ ట్రోలింగ్ వల్ల తన ఆరోగ్యం పాడైన క్రమం, కుటుంబ సభ్యులు కూడా బాధపడిన సందర్భాల గురించి తన కథనంలో రాశారు.

ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్‌గా పని చేస్తున్న సంధ్య స్త్రీ–పురుష సమానత్వం, హక్కులు, సమాన వేతనాలు, అత్యాచారాలు, వరకట్న వేధింపులు, క్యాస్టింగ్ కౌచ్ స్త్రీలను అణచివేసే సాంప్రదాయాలు, పురుషాధిపత్యం వంటి వాటికి వ్యతిరేకంగా పోరాడినందుకు ట్రోలింగ్‌కు తను గురైన క్రమాన్ని తన కథనంలో వివిధ సందర్భాలను జోడిస్తూ రాశారు. ఇండిపెండెంట్ జర్నలిస్ట్ గా, డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకర్‌గా కొనసాగుతున్న సి.వనజ ... గరికపాటి నరసింహారావు ప్రవచనాల్లో కనిపించే స్త్రీ వ్యతిరేక దృక్పథం గురించి మాట్లాడినప్పుడు తనను ట్రోల్ చేసిన విధానాన్ని, హిందుత్వ రాజకీయాల ప్రమేయం ఇందులో ఉండటం గురించి చెబుతూనే, 'ట్రోలింగ్ అన్నది కేవలం పొలిటికల్ విల్ ఉంటేనే ఆగుతుంది' అని అన్నారు. తనను ట్రోల్స్ ఎంత బాధించాయో అంత స్పష్టతను కూడా ఇచ్చాయని అంటారు ప్రొఫెసర్, రాజకీయ వ్యాఖ్యాత సూరేపల్లి సుజాత. ఫెమినిస్టులు, ఉద్యమకారులు, ఆక్టివిస్టుల పట్ల ట్రోలర్స్‌కు ఉండే నీచ అభిప్రాయం గురించి, అణగారిన ప్రజల కోసం పని చేసే క్రమంలో ఎదుర్కున్న ట్రోలింగ్ గురించి, దానికి దూరంగా ఉండే ప్రయత్నం లేదా పట్టించుకోకుండా ఉండటమే ఉత్తమం అని సూచించారు ఈ కథనంలో సుజాత. 'ది హిందూ' దినపత్రికలో సీనియర్ అసిస్టెంట్ ఎడిటర్‌గా పని చేస్తూ, సోషల్ మీడియాలో ఎక్కువగా రాజకీయ, సామాజిక అంశాలపై రాసే స్వాతి వడ్లమూడి జమ్ములో కథువా ప్రాంతంలో మైనర్ బాలికను హిందుత్వ మూకలు ఒక గుడిలో సామూహిక అత్యాచారం చేసిన ఘటనకు స్పందించి కార్టూన్ వేసినందుకు, 'బాధ పడకండి' అనే కవిత రాసినందుకు ట్రోల్‌కు గురైన విధానం గురించి, కులం లేని పితస్వామ్యం వల్ల ట్రోలింగ్ ఎలా విజంభిస్తుందో, స్త్రీల లైంగికతే లక్ష్యంగా ఎలా కొనసాగుతుందో తన కథనంలో రాశారు.

'ట్రోలింగ్'ను ఎక్కువగా వ్యక్తిగత వ్యవహారంగా చూడటం వల్ల– అది ఎక్కువగా కామెంట్స్ రూపంలో ఉండటం, అది సృష్టించే విధ్వంసం సోషల్ మీడియాలో చురుగ్గా లేని వారికి, వాటికి దూరంగా ఉండేవారికి అర్థం అయ్యే అవకాశం తక్కువ. అలాగే స్పందించేవారు ఎక్కువగా అంతో ఇంతో ఆ భావజాలం అంగీకరించే వారు కనుక, వారిని కూడా ట్రోల్ చేసే అవకాశాలు ఎక్కువ. ట్రోలింగ్ ఒక స్పందన దశను దాటి సమూహాలుగా ఏర్పడి, ట్రోల్ చేయడాన్ని ఒక వృత్తిగా భావిస్తూ, ఐక్యమవుతూ ఉంటే– దానిని వ్యతిరేకించే సాధనాలు మాత్రం చట్టపరంగానూ, సమాజ పరంగానూ ఏవి బలంగా లేవనే సత్యాన్ని ఒప్పుకోక తప్పదు. ట్రోలింగ్ పరోక్షంగా సమాజంలోని అనేకమంది అభిప్రాయాలను ప్రభావితం చేస్తుంది. అసలు వ్యక్తి ఎవరో తెలియకుండానే వారిపై ద్వేషం ఏర్పరుచుకునే వాతావరణాన్ని కల్పిస్తుంది. ట్రోలింగ్ ఒక భాగంలా చొచ్చుకుపోయే కొద్ది నియంతృత్వ శక్తులు బలపడుతూ, దీనిపై అవగాహన లేని వారిని సైతం వారికి కూడా తెలియకుండానే వారి కోసం పనిచేసేలా చేస్తాయి. ఇప్పుడు సమాజంలో ఈ 'ట్రోలింగ్' గురించి చర్చ, నిరసన అవసరం. ఆ అవసరాన్ని స్పష్టం చేస్తూ, ఆ నిరసనను అక్షరాలతో ఎక్కు పెట్టిన అస్త్రమే ఈ 'ట్రోల్' పుస్తకం.

– శృంగవరపు రచన



'ట్రోల్' పుస్తకంలో ముఖ్యంగా ఈ కథనాల ద్వారా ఈ కింది ఏడు ముఖ్య అంశాలు చర్చకు పెట్టే దిశలో ఉండేలా జాగ్రత్త తీసుకున్నట్టు ఈ పుస్తక సంపాదకులు కాత్యాయని విద్మహే, కె.ఎన్.మల్లీశ్వరి ముందుమాటలో రాశారు. అవి :

- సమకాలీన ఘటనల నుంచి, సందర్భాల నుంచి స్త్రీల నిత్య జీవితంలో ఆచారాలు, నోములు, వ్రతాలు, కట్టుబొట్టు పేరిట కనిపించకుండా అమలవుతున్న పితృస్వామిక అధికార రూపాలను గుర్తించి విమర్శకు పెట్టడం.
- స్త్రీల లైంగికత, లైంగిక సంబంధాల గురించి చర్చించటం.
- దళిత స్త్రీలు బయట నుంచి, లోపలి నుంచి ఎదుర్కుంటున్న వివక్ష గురించి చర్చించటం.
- మనుషుల మధ్య నిచ్చెన మెట్ల అధికార సంబంధాలను కుటుంబం పేరిట, కులం పేరిట, మతం పేరిట, రాజ్యం పేరిట స్థిరీకరించిన మనుస్మృతిని ప్రశ్నించటం.
- మనువాదుల వాదనలను తిప్పికొట్టటం.
- అశాస్త్రీయ భావాలను, ఆచరణలను విమర్శించటం, వ్యతిరేకించటం.
- ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలను, కార్యక్రమాలను విమర్శిస్తూ సరైన అవగాహన కల్పించే ఆచరణలో ఉండటం.

విద్యాప్రాంగణంలో అద్భుత ప్రయోగం!

రంగస్థలం

12.2.2024వ తేదీ సాయంత్రం రాజమండ్రి లారెల్ హై గ్లోబల్ స్కూల్ ఫౌండేషన్ డే సందర్భంగా ఓ అద్భుత ప్రదర్శన ఆవిష్కారం అయింది. తల్లిదండ్రులు, స్కూలు ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు మొత్తం 900 మంది ఒకే వేదిక మీద 150 నిమిషాల నిడివి గల 'లిబారక్ పూర్ సే లాల్ ఖిలాలి' అనే రంగస్థల ప్రదర్శన ఇచ్చారు. సాంకేతిక పరంగా ఖర్చుకు వెనకాడకుండా విశాల మైదానంలో ఆరుబయలు రంగస్థలం మీద దాదాపు 2000 మంది ప్రేక్షకుల సమక్షంలో చిరకాలం గుర్తుండిపోయే వేడుకగా 'ఫెస్టివ్ థియేటర్' పద్ధతిలో నిర్వహించారు. కిండర్ గార్డెన్ పసిపిల్లల నుంచి పెద్ద వయస్కుల వరకు స్వాతంత్ర సమరయోధులు, జాతీయస్థాయి నాయకులు, బ్రిటిష్ పాలకులతో, పాటు తెలుగు నేలకు చెందిన ఆరుగురు స్వాతంత్ర్య ఉద్యమ నాయకులకు సముచిత స్థానం కల్పించారు. ఇందులో ప్రసిద్ధమైన దేశభక్తి గీతాలు, జానపద గీతాలతో పాటు ప్రజాదరణ పొందిన హిందీ, పంజాబీ గీతాలు, అందుకు తగ్గ నృత్యాలు ప్రేక్షకులను కళ్ళు తిప్పుకోనివ్వలేదు.

600 ఏళ్ల నాటి చారిత్రక ఘట్టాలతో తొలినాటి అజ్ఞాత స్వాతంత్ర్య పిపాస కలిగిన వ్యక్తులను ఆహార్య ఆంగిక అభినయాలతో ఆవిష్కరించి మంత్రముగ్ధులను చేశారు. ఒక దృశ్యానికి మరో దృశ్యానికి అనుసంధానం చేస్తూ ఉపాధ్యాయులు కథను నడిపించారు. ఎలాంటి అంతరాయం, ఆలస్యం లేకుండా ఎంతో క్రమశిక్షణతో ప్రదర్శన సాగింది. అన్ని వయసుల విద్యార్థులు రిహార్సల్స్ ద్వారా వచ్చిన క్రమశిక్షణతో అప్రమత్తంగా ఉంటూ, తమ తమ స్థానాలకు రావడం, అక్కడి నుంచి నిష్క్రమించడం అలవోకగా జరిగిపోయాయి. ఉత్తేజాన్ని, ఉద్వేగాన్ని కలిగించే ఘట్టాల్లో ప్రతి ఒక్కరూ లీనమై మహోజ్వల ఘట్టాలను కళ్ళ ముందు నిలబెట్టారు.

సూరత్‌లో సుగంధ ద్రవ్యాల గోదాముకు మహారాజు నుంచి అనుమతి పొంది, అందుకు బదులుగా సైనిక శిక్షణ, ఆయుధాల ఆశ చూపుతూ ఈస్టిండియా కంపెనీ కాళ్లూనుకొంది. ఆ పరంపర గురించి చెబుతూ, విక్టోరియా మహారాణి ఆధిపత్యంలో బ్రిటిష్ సామ్రాజ్యానికి బానిస వలస రాజ్యంగా ఇండియా మారడం; రాబర్ట్ క్లైవ్ నుంచి వైస్రాయ్ పాలన మీదుగా మౌంట్ బాటెన్, రాడ్ క్లిఫ్ వరకు; జహంగీర్ అక్బర్ పాదుషాల పాలన మీదుగా బహదూర్ షా జఫర్ వరకు; మంగళ్ పాండే, ఝాన్సీ లక్ష్మీబాయి, అల్లూరి, ఉయ్యాలవాడ, ఉద్ధం సింగ్, భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్‌ల వరకు; తిలక్, లాల్ బాల్ పాల్, వివేకానంద, అరవింద్ ఘోష్ మొదలైన వారిని ఆయా సందర్భాల్లో వేదిక మీద చూపిస్తూ, రంగస్థలాన్ని అపూర్వ చారిత్రిక క్షేత్రంగా మార్చారు. ప్రథమ సిపాయి పితూరి, జలియన్ వాలాబాగ్, దండి సత్యాగ్రహం, క్విట్ ఇండియా, సైమన్ గో బ్యాక్, కాకోరి, సహాయ నిరాకరణ ఉద్యమ ఘట్టాలను కళ్లకు కట్టించారు. జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావం, ముస్లిం లీగ్, పూనా ఒప్పందం, రౌలెట్ చట్టం, బెంగాల్ విభజన, రాజ్యాంగ పరిషత్ సభ ఏర్పాటు, 1947 ఆగస్టు 14 అర్ధరాత్రి జాతీయ పతాక ఆవిష్కరణ, ఆపై నెహ్రూ చేసిన ప్రసంగం, విభజన అల్లర్లు, గాంధీ ఆమరణ నిరాహార దీక్ష వరకు ఘట్టాలను ప్రదర్శించారు. ఆఖరును భవిష్యత్ భారతంపై యువతీ యువకుల్లో కర్తవ్య పాలన దిశగా కార్యోన్ముఖులను చేశారు. రాబోయే రెండు దశాబ్దాల్లో భారత్‌ను అగ్రగామి దేశంగా నిలబెట్టడంలో పునరంకితం కావడానికి ప్రతిజ్ఞ బూనడంతో ఈ ప్రదర్శన ముగిసింది.



ప్రదర్శనలో ఒక సన్నివేశం; ఇన్‌సెట్‌లో దర్శకుడు వాల్టర్ పీటర్

ఈ ప్రదర్శనకు దర్శకుడు వాల్టర్ పీటర్. రంగస్థలం ద్వారా సామాజిక మార్పు తీసుకురావాలనేది ఆయన ఫెస్టివ్ డ్రామా ఆంతర్యం. గత 30 సంవత్సరాలుగా రంగస్థలానికే అంకితమై పని చేస్తున్నారు. ఇప్పటివరకు 2 లక్షల మంది పిల్లలతో, 30 వేల మంది విద్యార్థులతో, 50 వేల మంది తల్లిదండ్రులతో, 400 స్వచ్ఛంద సంస్థలతో రెండు వేల పాఠశాలల్లో ఐదు వేల శిక్షణా శిబిరాలను నిర్వహించారు. బాలికా విద్య, జాతి సమైక్యత, బాలల సంరక్షణ, సాంఘిక దురాచారాల ప్రతిఘటన, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన వంటి అంశాలతో ప్రదర్శనలు ఇచ్చారు. పిల్లలుగా నటన నేర్చుకుంటూ తమ గురించి తెలుసుకోవటం, 'యువత కోసం రంగస్థలం', థియేటర్ అప్రిసియేషన్ నేర్పటం, రంగస్థల అవసరాలు– అవకాశాలు మొదలైన వాటిని ప్రత్యక్షంగానూ, ఆన్లైన్ కోర్సుల ద్వారా నేర్పిస్తూ, జాతీయ అంతర్జాతీయ సమావేశాలు చర్చాగోష్ఠుల నిర్వహణలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు వాల్టర్ పీటర్. యూనిసెఫ్ సహకారంతో కోవిడ్– 19 సందర్భంలో 400 మందికి అవగాహన పెంపొందించే కార్యక్రమాలతో వారిని సమాచార వితరణ కార్యక్రమాల్లో భాగస్వాములను చేశారు. పలు జాతీయ అంతర్జాతీయ సదస్సులు, గోష్ఠులు, కార్యశాలల్లో నిర్విరామంగా పాల్గొంటున్నారు. లిమ్కా భారత్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి, వివిధ రాష్ట్రాల, జాతీయ అకాడమీల గుర్తింపు గౌరవం సన్మానాలు పొందారు. ఒక క్రిస్టియన్ కుటుంబం నుంచి, పాత ఢిల్లీ మురికివాడ నుంచి అహ్మదాబాద్ వరకు ఆయన ప్రస్థానం సాగింది. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా 1989లో ప్రారంభించిన 'థియేటర్ ఫర్ ఎడ్యుకేషన్' విభాగంలో విద్యార్థిగా శిక్షణ పొందారు. కొన్నాళ్లు అక్కడే ఉపాధ్యాయుడిగా పనిచేసి బయటకు వచ్చారు. కాశ్మీర్ నుంచి కేరళ వరకు నాలుగు వేలకు పైగా శిక్షణా శిబిరాలు, ఫెస్టివ్ థియేటర్లు నిర్వహించారు. ఎస్సీఈఆర్టీ, ఎన్సిఈఆర్టీ పాఠ్యాంశాల్లో భాగంగా ఆర్ట్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ పద్ధతిలో విద్యా శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. 'లా పో లా' అంటే భౌతిక భాగస్వామ్యంతో పాటు ఎమోషనల్ పార్టిసిపేషన్‌ని ఇది ప్రోత్సహిస్తుంది. సమ వయస్కులైన పిల్లలు, యువత ఇంటరాక్షన్, ఇంటిగ్రేషన్‌తో అన్ని రకాల కళారూపాలను వినియోగించుకుంటూ, సమాజంలో మార్పు తీసుకురావడమే 'లా పో లా' ఆశయం. ఉపాధ్యాయులు విద్యార్థులు కలిసి నటించడం వల్ల ఇద్దరి మధ్యలో అంతకుముందు లేని దగ్గరతనం, తెలుసుకోవడం, నేర్చుకోవడం సాధ్యమవుతాయి. థియేటర్‌ని క్లాస్ రూమ్‌గా, క్లాస్ రూమ్‌ని థియేటర్‌గా మార్చి నేర్చుకోవడం, ఒకే పాఠశాలలోని వేర్వేరు విద్యార్థులతో కలిసిపోవడం ఇందులోని ప్రత్యేకత.

వాల్టర్ పీటర్‌ని ఆహ్వానించి, సర్వం సమకూర్చి, విద్యార్థి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో మూడు వారాలపాటు మమేకమయ్యే అవకాశం ఇచ్చి, ఇంత ప్రదర్శన జరపటం లారెల్ హై గ్లోబల్ డైరెక్టర్లు సుంకర రవికుమార్, మల్లికార్జున రావు, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ సీఈవో, ఐటిఎన్ గురునాథరావు తదితరుల గొప్ప తనం. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను మరింత చేరువ చేసిన ఈ థియేటర్ ఫెస్టివల్ ఓ గొప్ప ప్రయోగం. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా జరిగిన ఈ కార్యక్రమం తెలుగు రంగస్థల భవిష్యత్తును ప్రభావితం చేయగలదని అనిపిస్తోంది.

– మల్లేశ్వరరావు ఆకుల
79818 72655

21న విజయవాడలో మాతృభాష దినోత్సవం

ఫిబ్రవరి 21 అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా మాతృభాషల ప్రాధాన్యత అనే అంశం మీద విజయవాడ లయోల కళాశాలలో, ఆ కళాశాల సహకారంతో సదస్సు నిర్వహిస్తున్నట్లు కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కె. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా.పాపినేని శివశంకర్, లయోల కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ కిషోర్, తెలుగు అధ్యాపకులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు, వేంకటేశ మాచకనూర్ (కన్నడ), ఇందు మీనన్ (మలయాళం), ఎల్. రామమూర్తి (తమిళం) పాల్గొంటారు. కవితాపఠనంలో వివిధ రాష్ట్రాల కవులు పాల్గొంటారు.

'నాగలి కూడా ఆయుధమే..!' పరిచయ సభ

ప్రముఖ కవి కొమ్మవరపు విల్సన్ రావు రచించిన 'నాగలి కూడా ఆయుధమే..' కవితా సంపుటి పరిచయ సభ 25 –2– 2024 ఆదివారం ఉదయం శ్రీకాకుళంలోని యుటిఎఫ్ కార్యాలయంలో జరగనుంది. సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాసు అధ్యక్షత వహిస్తారు. అట్టాడ అప్పలనాయుడు, కలిమి శ్రీ, డా. కె.జి.వేణు, డా. కె.ఉదయ్ కిరణ్, వి.జి.కె. మూర్తి, నెట్టిమి రమణారావు, చింతాడ తిరుమలరావు, దాసరి రామచంద్రరావు తదితరులు పాల్గొంటారు.

ఉమా నూతక్కికి మాడభూషి రంగాచార్య స్మారక కథాపురస్కారం

మాడభూషి రంగాచార్య స్మారక కథాపురస్కారం 2023 సంవత్సరానికి ఉమా నూతక్కి కథాసంపుటి '25వ గంట' ఎంపిక అయ్యింది. ఫిబ్రవరి25, ఆదివారం 5.30 గంటలకు కృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం, సుల్తాన్ బజార్, హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో రచయిత్రికి రు.10 వేల నగదు, జ్ఞాపిక అందజేయబడతాయి. నేటికాలపు మేటి కథకులు పుస్తకావిష్కరణ ఉంటుంది. శీలా సుభద్రాదేవి, శ్రీధర, కొండవీటి సత్యవతి, లలితాదేవి పాల్గొంటారు.

– శ్రీమతి మాడభూషి లలితాదేవి

ఆరాధన - ఆచరణ

ఆదర్శం ఎదురైన ప్రతిసారీ
అరమోడ్పు కన్నులతో
ముకుళిత హస్తాలతో
స్వాగతిస్తాం
బిరుదులు తగిలిస్తాం
భజనలు సాగిస్తాం
దాని దర్శన భాగ్యం కలిగిస్తూ
వీధికో విగ్రహం పెడతాం
దాని చుట్టూ ఆలయం కడతాం
హారతులిస్తాం
స్తుతిస్తాం..
భజిస్తాం.. పరవశిస్తాం!

అది నోరు తెరిచిందా,
తన గోడు వినమందా,
కీడు శంకిస్తాం
ఇక పరుగులంకిస్తాం.
మేమంతా
ఆదర్శానికి వారసులమే
కానీ అనుసరించడానికి నీరసమే!



– డా.డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ.
94408 36931.

ప్రమాదంలో రిజర్వేషన్లు

- దళితులకు అన్యాయం
- డివైఎఫ్ఐ యువ దళిత సదస్సులో యుజిసి మాజీ ఛైర్మన్ సుఖదేవ్ థోరాట్



డివైఎఫ్ఐ యువ దళిత సదస్సుకు హాజరైన నాయకులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో రిజర్వేషన్లు ప్రమాదంలో పడ్డాయని, దళిత తరగతులకు అన్యాయం జరుగుతోందని యుజిసి మాజీ ఛైర్మన్ సుఖదేవ్ థోరాట్ విమర్శించారు. డివైఎఫ్ఐ అఖిల భారత కమిటీ ఆధ్వర్యాన దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై పంజాబ్‌లోని చండీగఢ్‌లో బాబా సోహన్ సింగ్ భక్న భవన్‌లో ఆదివారం నిర్వహించిన దళిత యువ జాతీయ సదస్సులో థోరాట్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో దళితులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. రిజర్వేషన్లు ప్రమాదంలో పడ్డాయని పేర్కొన్నారు. ఇటీవల యుజిసి ఎస్‌సి, ఎస్‌టి రిజర్వుడు పోస్టులు భర్తీకాకపోతే, వాటిని జనరల్ కేటగిరిలో కలిపివేయాలని నిర్ణయం తీసుకుందని విమర్శించారు. దీనిపై ప్రతిఘటన రావడంతో వెనక్కి తగ్గిందని పేర్కొన్నారు. మోడీ అనుసరిస్తున్న మనువాద చర్యలు దళితులకు నష్టం చేస్తాయని పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానం వంటి విధానాలతో దళిత విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని, దీన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఉపాధి రంగంలో కూడా దళితులకు ఆశించిన అవకాశాలు లేవని అన్నారు. వీటన్నింటిని డివైఎఫ్ఐ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

డివైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎఎ రహీం, హిమాగ్నరాజ్ భట్టాచార్య, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్ తదితరులు పాల్గొని మాట్లాడారు. మోడీ పాలనలో దళిత యువకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. దేశ వ్యాప్తంగా నిరుద్యోగం పెరిగిందని, దళిత యువతలో అది మరింత పెరిగిందని అన్నారు. ఇప్పటికి అనేక రూపాల్లో దళితుల పట్ల వివక్ష చూపుతున్నారని చెప్పారు. అనేక రాష్ట్రాల్లో భౌతిక దాడులు చేసి హత్యలు చేస్తున్నారని విమర్శించారు. దేశంలో ప్రతి 18 నిమిషాలకు ఒక దాడి జరుగుతోందని పేర్కొన్నారు. ప్రతి వారానికి ఆరుగురు హత్యకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ ముగ్గురు దళిత మహిళలు అత్యాచారానికి గురవుతున్నారని అన్నారు. రోజుకు 27 చోట్ల దళితులపై దాడులు చేస్తున్నారని విమర్శించారు. దళిత యువతకు డివైఎఫ్ఐ అండగా ఉంటుందని తెలిపారు. ప్రతి రాష్ట్రంలో టీం ఏర్పాటు చేయాలని కోరారు. దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ నుంచి చర్చల్లో పాల్గొన్న డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న మాట్లాడుతూ.. దేశంలో మోడీ అధికారంలోకి వచ్చాక, మనువాదులు పెట్రేగి పోతున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అనేక రూపాల్లో దళితులపై దాడులు, అత్యాచారాలు, హత్యలు సర్వసాధారణంగా మారాయన్నారు. దళితులకు రక్షణగా ఉన్న చట్టాలను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. చదువు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దళిత యువతకు దొరకడం లేదని అన్నారు. మోడీ ప్రభుత్వాన్ని దళిత యువత ఓడించడంతోపాటు దళితుల పట్ల వివక్షకు వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతం చేయాలని డివైఎఫ్ఐ అఖిల భారత ఉపాధ్యక్షులు జాక్ సీ థామస్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, సదస్సు ఆమోదించింది. సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు రమణ, బాబు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



పాలస్తీనా విదేశాంగ మంత్రితో జైశంకర్ భేటీ

మ్యూనిచ్ : పాలస్తీనా విదేశాంగ మంత్రి రియాద్ అల్ మాలికితో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఆదివారం సమావేశమయ్యారు. ఈ విషయాన్ని జైశంకర్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. ఇజ్రాయిల్ దాడుల నేపథ్యంలో గాజాలో ప్రస్తుత పరిస్థితిపై తమ అభిప్రాయాలను పంచుకున్నట్లు తెలిపారు. 'పాలస్తీనా విదేశాంగ మంత్రి రియాద్ అల్ మాలికితో సమావేశం కావడం చాలా సంతోషంగా ఉంది. గాజాలో ప్రస్తుత పరిస్థితిపై అభిప్రాయాలు పంచుకున్నాం' అని మంత్రి తెలిపారు. సమావేశానికి సంబంధించిన ఫోటోను కూడా షేర్ చేశారు. మ్యూనిచ్ భద్రతా సదస్సు నేపథ్యంలో జైశంకర్ ప్రస్తుతం జర్మనీలోని మ్యూనిచ్ పట్టణంలో ఉన్న సంగతి తెలిసిందే. శనివారం ఈ సదస్సులో జైశంకర్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ - పాలస్తీనా సమస్య పరిష్కారానికి రెండు దేశాల ఏర్పాటే పరిష్కారమని భారత్ ఎన్నో ఏళ్ల నుంచి చెబుతున్న విషయాన్ని మరోసారి స్పష్టం చేశారు.


చండీగఢ్‌లో రైతు నాయకులతో చర్చలు జరుపుతున్న కేంద్రమంత్రులు, చర్చల్లో పాల్గొన్న పంజాబ్ సిఎం భగవంత్ మన్

21న బిజెపి, ఎన్‌డిఎ ఎంపిల ఇళ్ల వద్ద నల్లజెండాలతో నిరసన

- సంయుక్త కిసాన్ మోర్చా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2021 డిసెంబరు 9న ఎస్‌కెఎంతో చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తోపాటు కనీస మద్దతు ధర సి2+50 శాతం ప్రకారం పంటలను సేకరించాలని, సమగ్ర రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న బిజెపి, ఎన్‌డిఎ పార్లమెంటు సభ్యులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్దయెత్తున నల్లజెండాలు ప్రదర్శించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) రైతులకు పిలుపునిచ్చింది. 'కరెంటు ప్రైవేటీకరణ ఆపాలి. లఖింపూర్ ఖేరీలో రైతుల మారణకాండకు ప్రధాన సూత్రధారి కేంద్ర హోం సహాయ మంత్రి అజయ్ మిశ్రా టెనిని తొలగించి, విచారించాలి. పంజాబ్ సరిహద్దులో రైతుల అణచివేతను అరికట్టాలి' అని డిమాండ్ చేసింది. రైతు వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక, అణచివేత, నియంతృత్వ వైఖరిని బహిర్గతం చేయాలని విజ్ఞప్తి చేసింది.

పంజాబ్‌లో మూడురోజులపాటు ఎంపిలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, బిజెపి జిల్లా అధ్యక్షుల ఇళ్ల ముందు రాత్రి, పగలు భారీ నిరసనలు చేపట్టాలని ఎస్‌కెఎం నిర్ణయించింది. ఈ నిరసన ఈ నెల 20 ఉదయం 10 గంటలకు ప్రారంభమై 22న సాయంత్రం ఐదు గంటలకు ముగుస్తుందని తెలిపింది. ఎలక్టోరల్ బాండ్లతో అవినీతిని చట్టబద్ధం చేసి వేల కోట్ల రూపాయలను బిజెపి ఎన్నికల ఫండ్‌గా పోగు చేయడాన్ని ఎస్‌కెఎం తీవ్రంగా ఖండించింది. దీనిని కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఎస్‌కెఎం స్వాగతించింది.

నాణ్యమైన విద్య అందని ద్రాక్షే!

- నిరుద్యోగానికి అదీ ఓ కారణమే
- ఎఎస్ఇఆర్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ : దేశంలో నాణ్యమైన విద్య లభించడం లేదని యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ (ఎఎస్ఇఆర్) ఆందోళన వ్యక్తం చేసింది. గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులు ఎంతమంది విద్యను అభ్యసిస్తున్నారు, వారి విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయి అనే విషయాలపై ఎఎస్ఇఆర్ 2005లో అధ్యయనం ప్రారంభించింది. ఇప్పటి వరకూ మూడు నివేదికలు వెలువడ్డాయి. తాజాగా గత సంవత్సరం విడుదలైన నివేదిక పాఠశాల విద్యపై పెదవి విరిచింది. 14-18 సంవత్సరాల మధ్య వయసున్న విద్యార్థుల్లో విద్యకు సంబంధించిన పునాది ఇప్పటికీ బలహీనంగానే ఉన్నదని తేల్చింది. ఉద్యోగాలలో చేరే సమయంలో కూడా వీరికి ప్రాథమిక అవగాహన కొరవడిందని తెలిపింది.

తాజా నివేదిక ప్రకారం...14-18 సంవత్సరాల మధ్య వయసున్న వారిలో కేవలం 73.6% మంది మాత్రమే స్టాండర్డ్-2 స్థాయి పుస్తకాన్ని చదవగలుగుతున్నారు. గణితంలో కేవలం 45% మందికే ప్రాథమిక నైపుణ్యం ఉంది. మిగిలిన వారి పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నదని నివేదిక వివరించింది. బలమైన పునాది లేకపోవడంతో యువత సరైన ఉద్యోగాలు పొందలేకపోతున్నారు. మానవాభివృద్ధిలో విద్యకు ఉన్న ప్రాధాన్యత గురించి చెప్పాల్సిన అవసరం లేదు. ప్రజలు తమ సామాజిక, ఆర్థిక హోదాను మెరుగుపరచుకోవాలంటే తప్పనిసరిగా విద్యావంతులై ఉండాలి. పేదరికాన్ని నిర్మూలించడంలో విద్య సహాయకారిగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు విద్యకు తగినంత ప్రాధాన్యత ఇవ్వాలి. క్షేత్ర స్థాయిలో అలా జరగడం లేదు. 2022లో విడుదలైన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం నిరక్షరాస్యుల్లో, ప్రాథమికస్థాయి వరకూ చదువుకున్న వారిలో నిరుద్యోగ రేటు వరుసగా 0.4%, 1.0%గా ఉంది. సెకండరీ స్థాయి, ఆ పైన విద్యను అభ్యసించిన వారిలో నిరుద్యోగ రేటు 8.6%గా ఉంది.

విద్యావంతులైన వారందరికీ ఉద్యోగాలు లభించడం లేదు. పట్టభద్రుల్లో 45% మంది మాత్రమే ఉద్యోగాలు చేస్తున్నారని మెర్సర్ మెటిల్ సంస్థ రూపొందించిన నివేదిక తెలిపింది. భారత్‌లో విద్యనభ్యసించి పట్టభద్రులైన వారిలో నైపుణ్యం పరిమితంగా ఉండడమో లేదా పూర్తిగా లేకపోవడమో జరుగుతోందని గత సంవత్సరం ఏప్రిల్‌లో విడుదలైన బ్లూమ్‌బర్గ్ నివేదిక నిగ్గుతేల్చింది. మరోవైపు దేశంలో ఆర్థిక వృద్ధి జరుగుతున్నప్పటికీ అది ఉద్యోగాలను సృష్టించడం లేదు. దీనికి కారణం విద్యావంతుల్లో నైపుణ్యం కొరవడడమే. ఇక్కడ గమనించాల్సిన మరో ముఖ్యమైన విషయమేమంటే ఉన్నత విద్యలో ఏదైనా ఒక నిర్దిష్టమైన సబ్జెక్టులో డిగ్రీ సంపాదించిన వ్యక్తికి ఆ చదువుతో సంబంధం ఉన్న ఉద్యోగం లభించడం లేదు.

దేశ ఆర్థికాభివృద్ధికి విద్యా రంగం ఇతోధికంగా సాయపడుతోంది. దేశంలో విద్యా రంగం అంచనా విలువ 117 బిలియన్ డాలర్లు. ఈ విలువ 2025 నాటికి 225 బిలియన్ డాలర్లకు చేరుతుందని భావిస్తున్నారు. విద్యా రంగం ఇంతగా పురోభివృద్ధి చెందుతున్నప్పటికీ అనేక మంది యువతీ యువకులకు ఉద్యోగాలు లభించడం కష్టంగా ఉంది.

షార్జిల్ ఇమామ్‌కు బెయిల్ నిరాకరణ



న్యూఢిల్లీ : దేశద్రోహం, చట్ట వ్యతిరేక కార్యక్రమాల నిరోధక చట్టం (ఉపా) కింద నమోదైన కేసులో షార్జిల్ ఇమామ్‌కు బెయిల్ ఇచ్చేందుకు ఢిల్లీలోని కర్కర్డూమా కోర్టు నిరాకరించింది. పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)కు వ్యతిరేకంగా ఢిల్లీ, అలీగఢ్ ముస్లిం యూనివర్శిటీల్లో షార్జిల్ ఇమామ్ చేసిన ప్రసంగాలు అల్లర్లకు, హత్యలకు ప్రత్యక్షంగా ప్రేరణ కాకపోయినా.. గణనీయమైన జన సమీకరణ, 2020 ఫిబ్రవరిలో హింసాకాండ పెరుగుదలలో కీలక పాత్ర పోషించిందని కర్కర్డూమా కోర్టు అదనపు సెషన్స్ జడ్జి సమీర్ బాజ్‌పాయ్ శనివారం తన ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఇమామ్‌ను 2020 జనవరిలో అరెస్టు చేశారని, నాలుగేళ్లకు పైగా జైలులో ఉన్నందున బెయిల్ ఇవ్వాలని ఆయన తరుపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. దేశద్రోహం నేరారోపణలను సుప్రీంకోర్టు రద్దు చేసిందని, ఉపా కేసుల్లో గరిష్టంగా ఏడేళ్ల వరకూ మాత్రమే శిక్ష విధిస్తారని న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ వాదనలను ఢిల్లీ పోలీసులు వ్యతిరేకించారు. తనపై నమోదు చేసిన అభియోగాలను సవాల్ చేస్తూ ఇమామ్ దాఖలు చేసిన పిటీషన్‌ను మార్చి 8న ఢిల్లీ హైకోర్టు విచారించనుంది. ఇమామ్ బెయిల్ పిటీషన్‌పై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ట్రయల్ కోర్టును హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలోనే కర్కర్డూమా కోర్టు బెయిల్ నిరాకరిస్తున్నట్లు తాజాగా పేర్కొంది.

అదృశ్యమైన మహిళ మృతదేహం లభ్యం

- పోలీసులు, జర్నలిస్టులపై గ్రామస్తుల దాడి

పాట్నా : రెండు రోజుల కింద అదృశ్యమైన మహిళ శవమై కనిపించడంతో, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కిడ్నాప్‌నకు గురైందని ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించకుండా నిర్లక్ష్యం వహించారంటూ పోలీసులపై దాడి చేశారు. ఒక పోలీస్ వాహనానికి నిప్పుపెట్టారు. న్యూస్ కవర్ చేసేందుకు వచ్చిన జర్నలిస్టులపై దాడి చేశారు. దీంతో ఇద్దరు జర్నలిస్టులు తీవ్రంగా గాయపడ్డారు. బీహార్‌లోని నవ్‌గాచియాలో ఈ సంఘటన జరిగింది. ఈ నెల 16న పాలు అమ్మేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన శోభాదేవి కనిపించకుండా పోయింది. ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె మృతదేహం ఆదివారం కనిపించింది. గ్రామస్తుల దాడి గురించి తెలుసుకున్న పోలీస్ ఉన్నతాధికారులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామస్తులను శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. అలాగే ఆ గ్రామంలో పరిస్థితిని నియంత్రించేందుకు పోలీసులను మోహరించారు. మహిళ హత్యపై దర్యాప్తు చేస్తున్నారు.

చండీగఢ్ మేయర్ రాజీనామా

చండీగఢ్ : చండీగఢ్ మేయర్‌గా ఎన్నికైన మనోజ్ సొంకార్ ఆదివారం సాయంత్రం తన పదవికి రాజీనామా చేశారు. ముగ్గురు ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన కౌన్సిలర్లు బిజెపిలో చేరిపోయారు. మనోజ్ సొంకార్ ఎన్నికకు వ్యతిరేకంగా దాఖలైన పిటీషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించనుంది. ఈ నేపథ్యంలో ఒక రోజు ముందుగా మనోజ్ రాజీనామా చేసినట్లు భావిస్తున్నారు. జనవరి 30న చండీగఢ్ మేయర్ ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్, ఆప్ కౌన్సిలర్లకు చెందిన ఏడు ఓట్లను చెల్లనివిగా ప్రకటించి బిజెపి అభ్యర్థి మనోజ్ సొంకార్ విజయం సాధించినట్లుగా అధికారులు ప్రకటించారు. చెల్లని ఓట్లుగా ప్రకటించడం కోసం ప్రతిపక్ష కౌన్సిలర్ల బ్యాలెట్ పత్రాలపై ఎన్నికల అధికారి పిచ్చి గీతలు పెడుతున్న వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎన్నికల అక్రమాలను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును ఆప్ ఆశ్రయించింది. గత విచారణలో ఈ ఎన్నికను 'ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడంగా' సుప్రీంకోర్టు విచారించింది. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. సోమవారం జరిగే విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాలని ప్రిసైడింగ్ అధికారిని ఆదేశించింది.

వచ్చే ఐదేళ్లూ కీలకం

- బిజెపి జాతీయ సదస్సులో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు వచ్చే ఐదేళ్లూ కీలకమని, కాబట్టి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని 'భారీ మెజార్టీ'తో మూడోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తమ పార్టీ కార్యకర్తలను కోరారు. ఆదివారం న్యూఢిల్లీలో జరిగిన బిజెపి జాతీయ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన హయాంలో జరిగిన కార్యక్రమాల గురించి వివరించారు. మహిళల మరుగుదొడ్ల సమస్యను లేవనెత్తిన తొలి ప్రధానమంత్రి తానేనని అన్నారు. దేశాన్ని భారీ కుంభకోణాలు, తీవ్రవాద దాడులు నుంచి విముక్తి చేశామని చెప్పుకున్నారు. అయోధ్యలో రామమందిరం నిర్మించడం ద్వారా 500 ఏళ్ల ప్రజల నిరీక్షణను బిజెపి ముగించిందని చెప్పారు. తమ ప్రభుత్వం 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకి తీసుకొచ్చిందని ప్రధాని తెలిపారు. దేశంలో దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న వారి సంఖ్య భారీగా పెరిగిందని ప్రపంచ సూచీలన్నీ పేర్కొంటుండగా, అందుకు భిన్నంగా ఆయన మాట్లాడటం గమనార్హం.

ప్రధానిని అభినందిస్తూ బిజెపి తీర్మానం

"వికసిత్ భారత్ - మోడీ గ్యారంటీ" పేరుతో రూపొందించిన తీర్మానం.. భారత ఆర్థిక పురోగతి విషయంలో మోడీని ప్రశంసించింది. బిజెపి జాతీయ కౌన్సిల్ సమావేశంలో ఈ తీర్మానాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రవేశపెట్టగా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బలపరిచారు. యుపి ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ తీర్మానానికి మద్దతుగా మాట్లాడారు. మోడీ నాయకత్వంలో, రాముని ఆలయాన్ని నిర్మించటమే కాకుండా, గత 10 సంవత్సరాలలో రామరాజ్య భావనను సమర్థవంతంగా అమలు చేశారని తీర్మానం పేర్కొనటం గమనార్హం.

చేతులెత్తేసిన మోడీ ప్రభుత్వం

- ఉద్యోగ కల్పనలో స్తబ్దత
- తైవాన్, ఇజ్రాయిల్‌తో ఒప్పందాలు
- కార్మికులను తరలించేందుకు ప్రయత్నాలు
- లక్నో ఐఐఎం వెల్లడి

న్యూఢిల్లీ : దేశంలో ఉద్యోగాల వృద్ధి రేటులో స్తబ్దత నెలకొన్నదని లక్నో ఐఐఎం పరిశోధకులు తెలిపారు. బిట్స్ పిలానీ, కేంద్ర వ్యవసాయ-కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సహకారంతో లక్నో ఐఐఎం పరిశోధకులు ఓ నివేదికను రూపొందించారు. జాతీయ శాంపిల్ సర్వే కార్యాలయం, ఉద్యోగ-నిరుద్యోగ సర్వే, పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేల నుండి తీసుకున్న సమాచారం ఆధారంగా నివేదికను తయారు చేశారు. 1987-88 నుండి 2004-05 వరకూ ఉద్యోగాల కల్పనలో వృద్ధి కన్పించిందని, అయితే 2004-05 నుండి 2018-19 వరకూ తిరోగమనం నమోదైందని నివేదిక తెలియజేసింది. ఆ తర్వాత కూడా పరిస్థితిలో పెద్దగా మార్పేమీ రాలేదని చెప్పింది. దీనిని బట్టి చూస్తే ఉద్యోగ కల్పనలో మోడీ ప్రభుత్వం చేతులెత్తేసిందని అర్థమవుతోంది.

నివేదిక ప్రకారం 2020-21లో దేశంలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 556.1 మిలియన్లు. వీరిలో అత్యధికంగా 54.9% మంది స్వయం ఉపాధి పొందిన వారే. కేవలం 22.8% మంది మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు. 22.3% మంది క్యాజువల్ ఉద్యోగులు. ఉద్యోగ సంక్షోభం, ఉద్యోగ నాణ్యతపై 'ది వైర్' పోర్టల్ గత సంవత్సరం మే 2న ఓ కథనాన్ని అందించింది. దేశంలో ఉద్యోగ నాణ్యత చాలా తక్కువగా ఉన్నదని, అనేక ఉద్యోగాలలో తక్కువ వేతనాలు ఇస్తున్నారని సీఎంఐఈకి చెందిన మహేష్ వ్యాస్ చెప్పారు.

విదేశాలకు కార్మికులు

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళా ఉద్యోగినుల విషయంలో వివక్ష కొనసాగుతోందని ఐఐఎం నివేదిక ఎత్తిచూపింది. 1983 నుండి 2020-21 వరకూ పురుషులతో పోలిస్తే మహిళా ఉద్యోగుల శాతం (ఎల్‌ఎఫ్‌పిఆర్) తగ్గింది. దేశంలో నైపుణ్యం లేని లేదా కొంతమేర నైపుణ్యం కలిగిన వారిని తైవాన్, ఇజ్రాయిల్ దేశాలకు పంపి అక్కడ వారికి ఉపాధి కల్పించడానికి మోడీ ప్రభుత్వం మధ్యవర్తిత్వం వహిస్తోంది. దేశంలో ఉత్పత్తికి సంబంధించిన పరిశ్రమల్లో వారికి ప్రభుత్వం ఉపాధి కల్పించలేకపోవడమే దీనికి కారణం. ఈ నెల 16న తైవాన్‌తో మోడీ సర్కారు ఎంఓయూ కుదుర్చుకుంది. దేశంలో నెలకొన్న ఉద్యోగ సంక్షోభం కారణంగానే కార్మికులను ఇజ్రాయిల్ పంపుతున్నారని బీబీసీ గత నెలలో తెలిపింది. గాజాపై ఇజ్రాయిల్ యుద్ధం చేయడానికి ముందే 42 వేల మంది నిర్మాణ కార్మికులు, నర్సులను పంపేందుకు మోడీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది.

నివేదిక ఏం చెప్పింది ?

విద్యా స్థాయి పెరిగినప్పటికీ దానికి అనుగుణంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడడం లేదు. దేశంలో ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని నివేదిక స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం, పేదరిక నిర్మూలన కార్యక్రమాలు, ప్రజా పనులపై మరింతగా దృష్టి సారించాలని ప్రభుత్వానికి సూచించింది. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వేతనాలు 5% మేర పెరుగుతాయని, మహిళా కార్మికుల సంఖ్య కూడా పెరుగుతుందని, గ్రామీణ వేతన స్థాయిలు పెరుగుతాయని తెలిపింది.


పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థుల రద్దీ

60 వేల కానిస్టేబుల్ పోస్టులకు 50 లక్షల మంది దరఖాస్తు

- యుపిలో తాండవిస్తున్న నిరుద్యోగం

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లో నిరుద్యోగం తాండవిస్తోంది. 60,244 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు ఏకంగా 50,14,924 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 35 లక్షల మంది పురుషులు, 15 లక్షల మంది మహిళలు ఉన్నారు. రిజర్వేషన్ విధానం ప్రకారం మహిళా అభ్యర్థులకు 20 శాతం పోస్టులు ఉన్నాయి. 12,049 మంది మహిళలు ఉద్యోగాలు పొందనున్నారు. అంటే ఒక ఉద్యోగానికి 124 మంది పోటీ పడుతున్నారు. 49,195 మంది పురుషులు పొందనున్నారు. ఒక ఉద్యోగానికి 73 మంది పోటీ పడుతున్నారు. సంబంధిత అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... యుపిపిఆర్‌పిబి ఆధ్వర్యాన యుపి పోలీస్ కానిస్టేబుల్ - 2024 పరీక్షలను 75 జిల్లాల్లోని 2,385 కేంద్రాల్లో శని, ఆదివారాల్లో నాలుగు షిఫ్టుల్లో నిర్వహించారు. దరఖాస్తుదారుల్లో ఆరు లక్షల మందికిపైగా ఇతర రాష్ట్రాల వారు ఉన్నారు. బీహార్ 2,67,305, హర్యానా 74,769, జార్ఖండ్ 17,112, మధ్యప్రదేశ్ 98,400, ఢిల్లీ 42,259, రాజస్థాన్ 97,277, ఉత్తరాఖండ్ 14,627, పశ్చిమ బెంగాల్ 5,512, పంజాబ్ 3404, మహారాష్ట్ర 3,151 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో 22 జిల్లాలకు చెందిన 120 మందిని పరీక్ష రాసేటప్పుడు అక్రమాలకు పాల్పడినందుకు అరెస్టు చేశారు.

సన్నీ లియోన్ దరఖాస్తు?

రిక్రూట్‌మెంట్ పరీక్ష అడ్మిట్ కార్డులో సినీ నటి సన్నీ లియోన్ పేరు, ఫొటో కనిపించింది. అడ్మిట్ కార్డు ఫోటో సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. అడ్మిట్ కార్డులో శ్రీమతి సోనేశ్రీ మెమోరియల్ గర్ల్స్ కాలేజ్, తిర్వా, కనౌజ్ పరీక్షా కేంద్రంగా పేర్కొనబడింది. ఈ చిరునామా ముంబైలో ఉంది. మహోబాకు చెందిన ఓ వ్యక్తి పేరిట ఉన్న మొబైల్ నెంబర్‌ను ఉపయోగించి దరఖాస్తు పంపినట్లు జాతీయ మీడియా పేర్కొంది. కనౌజ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బెంగళూరు శివార్లలో అగ్ని ప్రమాదం

- ముగ్గురి మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు

బెంగళూరు : కర్ణాటక రాజధాని బెంగళూరు శివార్లలో ఒక పెర్‌ఫ్యూమ్ గిడ్డంగిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ముగ్గురు మరణించారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. కుంబలగోడు సమీపంలోని రామసముద్ర వద్ద ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న వెంటనే అక్కడకు చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. గిడ్డంగి నుంచి ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు. గాయపడిన వారిని విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


పెర్‌ఫ్యూమ్ గిడ్డంగి నుంచి మంటలు ఎగసిపడుతున్న దృశ్యం

డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అంటే నిరుద్యోగులకు రెండింతల కష్టాలు

- రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అంటే 'నిరుద్యోగులకు రెండింతల కష్టాలు' అని అర్థమని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ విమర్శించారు. ఆదివారం తన సోషల్ మీడియాలో హిందీలో ఒక పోస్టు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో ప్రతీ మూడో యువకుడు 'నిరుద్యోగం అనే వ్యాధి'తో బాధపడుతున్నారని రాహుల్ తెలిపారు. 'ఉత్తరప్రదేశ్‌లో 1.5 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్న భర్తీ చేయడం లేదు. కనీస విద్యార్హతతో భర్తీ చేసే పోస్టులకు కూడా గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, పిహెచ్‌డి హోల్డర్లు లైన్‌లో నిలబడి ఉన్నారు' అని ఆయన పేర్కొన్నారు. 'రిక్రూట్‌మెంట్ ప్రకటనలకోసం నిరుద్యోగులు వేచి చూడ్డం మొదటిది. రెండోది రిక్రూట్‌మెంట్ ప్రకటన వచ్చి పరీక్ష జరిగినా ఆ పేపర్ లీకవుతుంది. దీంతో ఆ పరీక్షల ఫలితాలు విడుదల కావు' అని రాహుల్ వివరించారు. ఒకవేళ ఫలితం వచ్చినా సుదీర్ఘకాలం వేచి వుండాలని, జాయినింగ్‌లపై భరోసా కోసం కోర్టులకు తరుచూ వెళుతూ ఉండాలని రాహుల్ తెలిపారు. ఆర్మీ నుంచి రైల్వే వరకూ.. ఉపాధ్యాయ పోస్టుల నుంచి పోలీసు రిక్రూట్‌మెంట్లు కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తూ లక్షలాది మంది నిరుద్యోగులు వయోపరిమితి దాటిపోయారని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ విధానాలు మాత్రమే యువత కలలకు న్యాయం చేస్తాయని, యువకుల తపస్సును వృథా కానివ్వబోమని రాహుల్ తన పోస్టులో తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో సిఎఎఫ్ కమాండర్ హత్య

- మావోయిస్టుల దుశ్చర్య

బీజాపూర్ : ఛత్తీస్‌గఢ్‌లో కమాండర్ స్థాయి అధికారిని మావోయిస్టులు కిడ్నాప్ చేసి, హత్య చేశారు. ఛత్తీస్‌గఢ్ ఆర్మ్‌డ్ ఫోర్స్ (సిఎఎఫ్) 4వ బెటాలియన్ కమాండర్ తిజౌరామ్ భూర్య ఆదివారం బీజాపూర్ జిల్లా కుట్రు పోలీస్‌స్టేషన్ పరిధి అటవీప్రాంతంలోని సిఎఎఫ్ క్యాంప్‌నకు 200 మీటర్ల దూరంలో తన సిబ్బందితో కలిసి వంట చెరకు సేకరిస్తున్నారు. అప్పటికే అక్కడ కాపుగాసిన మావోయిస్టులు తిజౌరామ్ భూర్యను కిడ్నాప్ చేశారు. అనంతరం గొడ్డలితో దాడి చేసి, హత్య చేశారు. అక్కడినుంచి పరారయ్యారు. వెంటనే ఘటనాస్థలికి వచ్చిన జవాన్లు అప్పటికే భూర్య మరణించినట్లు గుర్తించి, పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించారు. భూర్య స్వగ్రామం నారాయణ్‌పూర్ జిల్లా భానుప్రతాపపురం అని తెలుస్తోంది. మావోయిస్టుల కోసం గాలింపు చర్యలను భద్రతాదళాలు ముమ్మరం చేశాయి.

రేషన్ బస్తాలపై మోడీ చిత్రం కోసం కోట్లు వ్యయం



న్యూఢిల్లీ : ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద ఆహారధాన్యాల పంపిణీకి ఉపయోగించే బస్తాలపై నరేంద్ర మోడీ చిత్రం ముద్రించేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. మోడీ చిత్రంతో కూడిన ప్రత్యేక సంచులను ముద్రించాలని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ యూనిట్లను ఆదేశించింది. రాజస్థాన్‌లోనే 13.29 కోట్ల సింథటిక్ బ్యాగులను ఆర్డర్ చేశారు. మోడీ చిత్రాన్ని ముద్రించేందుకు ఒక్కో బ్యాగ్‌కు అదనంగా రూ.12.37 కాగా.. నాగాలాండ్ ఒక్కో బ్యాగ్‌కు రూ.9.30 చొప్పున కాంట్రాక్ట్ ఇచ్చింది. తమిళనాడులో 1.14 కోట్ల బస్తాలకు టెండర్ పిలిచారు. రేషన్ షాపుల్లో ప్రధాని నరేంద్ర మోడీ కటౌట్‌తో కూడిన సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను కేరళ తిరస్కరించింది. కోవిడ్-వ్యాక్సినేషన్ సర్టిఫికెట్‌పై ప్రధాని ఫోటోను ముద్రించడం ప్రపంచవ్యాప్తంగా విమర్శల పాలైన సంగతి తెలిసిందే.

నాజర్ ఆసుపత్రిలో స్తంభించిన సేవలు

జెరూసలేం : గాజా స్ట్రిప్‌లో రెండో అతిపెద్ద ఆసుపత్రిగా పేరు గాంచిన నాజర్ ఆసుపత్రిలో సేవలు పూర్తిగా స్థంభించాయని అధికారులు వెల్లడించారు. గాజాలోని ఖాన్ యూనిస్ పట్టణంలో ఉన్న ఈ ఆసుపత్రి నెల రోజుల నుంచి ఇజ్రాయిల్ సైన్యం ఆధీనంలోనే ఉంది. ఈ ఆసుపత్రిలో సుమారు 200 రోగుల ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల వెల్లడించింది. ఉగ్రవాదులు ఉన్నారనే అనుమానంతో ఈ ఆసుపత్రిని ఇజ్రాయిల్ సైన్యం స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి కూడా ఇక్కడ వైద్య సేవలు క్షీణిస్తూ వచ్చాయి. తాజాగా ఆసుపత్రిలో సేవలు పూర్తిగా స్థంభించి పోయినట్లు గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది.

కాల్పుల విరమణలో పురోగతి లేదు : ఖతార్ ప్రధాని

గాజాలో కాల్పుల విరమణ అమలు దిశగా ఏ విధమైన పురోగతి లేదని ఖతార్ ప్రధానమంత్రి షేక్ మహ్మద్ బిన్ అబ్దుల్ రహ్మాన్ బిన్ జాసిమ్ అల్ థానీ తెలిపారు.

విదేశాంగ మంత్రి కూడా అయిన అల్ థాని శనివారం విలేకరులతో మాట్లాడుతూ గాజాలో కాల్పుల విరమణ అమల్లోకి రావాలని ఖతార్ కోరుకుంటుందని చెప్పారు. కాల్పుల విరమణ అమలులోకి వస్తే గాజాకు చెందిన ప్రజలు తిరిగి తమ ఇళ్లకు వెళ్లడానికి అవకాశం కలుగుతుందని అన్నారు.

రఫా వద్ద బఫర్ జోన్ నిర్మిస్తున్న ఈజిప్టు

గాజా సరిహద్దుల్లో ఉన్న రఫా పట్టణానికి సమీపంలో భారీ సిమెంట్ కంచెను నిర్మిస్తున్నట్లు ఈజిప్టు వెల్లడించింది. ఇది గాజాకు మరింత సహాయాన్ని అందించడానికి ఏర్పాటు చేస్తున్న 'బఫర్ జోన్'గా పేర్కొంది. ఇక్కడ ట్రక్కుల కోసం పార్కింగ్ ప్రాంతాలు, గిడ్డంగులు, అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాలు, డ్రైవర్లకు వసతి కోసం గృహాలు నిర్మిస్తున్నట్లు తెలిపింది.

ఇజ్రాయిల్ దాడుల భయంతో వలస వచ్చే పాలస్తీనీయుల కోసం వసతి గృహాలను నిర్మిస్తున్నామని, గాజా సరిహద్దు వెంబడి కంచె నిర్మిస్తున్నామని వస్తున్న వార్తలు పూర్తిగా ఊహాజనితమని ఈజిప్టు మరోసారి స్పష్టం చేసింది. పాలస్తీనాను ఒక దేశంగా గుర్తించడానికి జరుగుతున్న చర్యలను ఇజ్రాయిల్ వ్యతిరేకించింది. ఇలాంటి 'ఏకపక్ష గుర్తింపు'ను ఖండిస్తున్నామంటూ ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశం ఒక ప్రకటన విడుదల చేసింది.





మీ కోసం

గోరువెచ్చని నీళ్లల్లో కొద్దిగా నిమ్మకాయ రసం పిండి, సర్ఫ్ వేసి బాగా కలపాలి. ఈ నీటిలో స్పాంజీ గానీ, మెత్తని వస్త్రాన్ని గానీ ముంచి గోడలపై ఉన్న పెన్సిళ్లు, స్కెచ్ మరకలను రుద్దితే మరకలు పోతాయి.


జీవన సౌరభం

అజ్ఞానం కన్నా నిర్లక్ష్యమే ఎక్కువ నష్టాన్ని కలిగిస్తుంది.

కోపర్నికస్ గురించి తెలుసా?

పిల్లలూ, ఈ రోజు సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని బలపర్చిన నికోలాస్ కోపర్నికస్ గురించి తెలుసుకుందాం.

నికోలాస్ కోపర్నికస్ మధ్యయుగానికి చెందిన ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త. సూర్య కేంద్రక సిద్ధాంతాన్ని ధ్రువ పరిచిన వారిలో ప్రథముడు. ఫిబ్రవరి 19, 1473లో థార్న్ అనే పట్టణంలో జన్మించాడు. ఇటలీలోని బొలోగ్నా విశ్వవిద్యాలయంలో న్యాయ శాస్త్రం, గణిత శాస్త్రం, ఖగోళ శాస్త్రం అభ్యసించాడు. గ్రీకు భాష నేర్చుకుని ఎన్నో గ్రంథాలను కంఠస్థం చేశాడు. 29 ఏళ్ళ వయస్సులో రోమ్ విశ్వ విద్యాలయంలో ఖగోళ శాస్త్ర నిపుణుడిగా చేరాడు. అరిస్టాటిల్, టోలెమీకు బలపరిచిన భూ కేంద్రక సిద్ధాంతం కంటే పైథాగరస్ సూర్య కేంద్రక సిద్ధాంతమే సరైందని బలంగా నమ్మాడు.




గ్రహాల కదలికల ఆధారంగా గ్రహాలు సూర్యుని చుట్టూ తిరుగుతున్నాయని మొట్టమొదట నిరూపించిన వాడు కోపర్నికస్. భూమి తన అక్షము పైనే తిరుగుతుందని అందువల్లే రాత్రి పగలూ ఏర్పడుతున్నాయని ధృవపరిచాడు. భూభ్రమణ, పరిభ్రమణాల వల్లే శీతోష్ణ స్థితులు, ఋతువులు మారుతున్నాయని గ్రహించాడు. ఈ విషయాలన్నీ వాస్తవాలే అయినా వాటిని బయట పెట్టడానికి కోపర్నికస్‌కు ధైర్యం చాలలేదు. అప్పట్లో మత గ్రంథాలు, జ్యోతిష గ్రంథాలలో రాసిన సూర్యుడే భూమి చుట్టూ తిరుగుతున్నాడన్న విషయాన్ని బలంగా నమ్మేవారు.

తన సిద్ధాంతాన్ని బాహ్య ప్రపంచానికి తెలియజేసిన రోజున 'ఖగోళ శాస్త్రాన్నే తలకిందులుగా చేస్తున్న మూర్ఖుడు' అని మార్టిన్ లూథర్ దూషించాడు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా కోపర్నికస్ తాను సేకరించిన, తెలుసుకున్న వివరాలన్నింటిని గ్రంథంగా అచ్చు వేయించి అప్పటి పోప్, మూడవ పాల్‌కు అంకితం చేశాడు. ఇది జర్మనీలో ఉన్న న్యూవెంబర్గ్‌లో ప్రచురితమయినది. ఈ పుస్తకంలోని అంశాలు వివాదానికి దారి తీస్తాయోమోనన్న భయంతో ప్రచురణకర్తలు 'దీనిని విజ్ఞాన గ్రంథంగా పరిగణించగూడదు' అని ముందుగానే చెప్పుకున్నారు. ఈ విషయాలేవీ తెలియకుండానే 1543 మే 21 లో కోపర్నికస్ కన్ను మూశాడు.

కోపర్నికస్ కంటే కొన్ని శతాబ్దాల ముందు ఎంతోమంది భారతీయ, గ్రీకు శాస్త్రవేత్తలు సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని గురించి ప్రస్తావించినా ఇతని రచనల్లో సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని, సైద్ధాంతికంగా నిరూపించడంతో ప్రాధాన్యం సంతరించుకున్నాడు. దీంతో ఆధునిక సైన్సులో కోపర్నికస్ విప్లవం ఆరంభమైంది. కోపర్నికస్ అందించిన ఈ వివరాలే తరువాత రంగంలోకి దిగిన టైకో బ్రాహి, కెప్లర్, గెలీలియో, న్యూటన్, ఐన్ స్టైన్ వంటి వాళ్లకు పునాది రాళ్ళుగా నిలిచాయి.

నేను గీసిన బొమ్మ





జి.హాసిని, 9వ తరగతి, రాయిలాపూర్, మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ప్రస్తుత జీవనశైలి, మారిన ఆహారపు అలవాట్లు, ఒత్తిళ్లు ... ఇలా అనేక రకాల కారణాలతో చాలామంది మలబద్ధకం సమస్యలతో బాధపడుతున్నారు. అయితే దీనిని మొదట్లోనే నియంత్రించాలి. లేకపోతే దీర్ఘకాలిక వ్యాధిగా మారే ప్రమాదం ఉంటుంది. మూలశంఖ, ప్రేగు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుంది. మనం తినే ఆహారంలో సరైన కేలరీలు, ఫైబర్, పోషకాలు లేకపోతే మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయి. ప్రతిరోజూ శరీరానికి అవసరమైన మంచినీటిని తాగకపోవటం, తిన్న ఆహారం సరిగ్గా అరగకపోవడం, శారీరక శ్రమ లేకపోవడం, సరైన వ్యాయామం చేయకపోవడం వల్ల కూడా ఏర్పడవచ్చు. మలబద్ధకం సమస్య వస్తే దాని వల్ల కడుపులో మంట, కడుపు ఉబ్బరం, గ్యాస్, అసిడిటీ సమస్యలు తలెత్తుతాయి. బాత్రూమ్ వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నా, పొడిగా వస్తున్నా, గట్టిగా వస్తున్నా, వెళ్లే చోట నొప్పి పుడుతున్నా, పూర్తిగా విసర్జన చేయలేక ఇబ్బంది పడుతున్నా కూడా మలబద్ధకం సమస్యగానే చూడాలి. ఇలాంటి సమస్యలతో ఇబ్బంది పడేవారు పీచు పదార్థాలు ఎక్కువగా ఉండే పండ్లు తీసుకోవాలి. తద్వారా ఈ సమస్య నుంచి కొంతవరకూ బయట పడే అవకాశం ఉంటుంది.

మలబద్ధకానికి చెక్ పెట్టండిలా ...



అరటి పండ్లు : మలబద్ధకం సమస్య తగ్గించటంలో ఇవి బాగా దోహదపడతాయి. అరటిలో ఉండే పీచు పదార్థం మల బద్ధకాన్ని నివారిస్తుంది. జీవ ప్రక్రియను, పేగు కదలికలను సులభతరం చేస్తుంది. పొట్టను శుభ్రం చేస్తుంది. క్రమం తప్పకుండా రోజూ ఒక అరటిపండు తినటం వల్ల ఈ సమస్యను అధిగమించొచ్చు. జీవప్రక్రియను, పేగు కదలికలను సులభతరం చేస్తుంది. పొట్టను శుభ్రం చేస్తుంది. క్రమం తప్పకుండా రోజూ ఒక అరటి పండు తినడం వల్ల ఈ సమస్యను అధిగమించొచ్చు. చిన్న పిల్లల నుంచి పెద్ద వారి వరకూ అరటి పండును తీసుకోవచ్చు.

అంజీర్ : వీటిలో కూడా పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఫైబర్ కంటెంట్ బాగా ఎక్కువగా ఉంటుంది. రాత్రంతా నీళ్లలో నానబెట్టి ఉదయాన్నే తీసుకుంటే ఆరోగ్యంతోపాటుగా మలబద్ధకం కూడా తగ్గుతుంది. ఇవి పేగు కదలికలను మెరుగుపరచి, జీర్ణ వ్యవస్థ సక్రమంగా పనిచేయటానికి సహాయపడుతుంది.

కివి ఫ్రూట్ : వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్‌సి, రోగ నిరోధక శక్తి, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఈ ఫ్రూట్ తిన్నా మలబద్ధకం సమస్య తగ్గుతుంది.

ఆల్‌బకరా : మలబద్ధకం సమస్యను తగ్గించేందుకు ఇవి చక్కగా పనిచేస్తాయి. వీటిలో అధికంగా ఫైబర్, ఫైటో న్యూట్రియెంట్లు, సార్బిటాల్ ఉంటాయి. తద్వారా జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. పేగు కదలికలను సులభతరం చేసి మలబద్ధకం లేకుండా చేస్తుంది. ఆరోగ్యానికి కూడా దోహదపడుతుంది.

కర్బూజ : ఈ పండులో ఉండే పొటాషియం రక్తపోటును క్రమపరిచి హైపర్ టెన్షన్‌ను దూరంగా ఉంచుతుంది. విటమిన్ ఎ, బీటా కెరొటిన్ దృష్టిని మెరుగుపరచి శుక్లాలు రాకుండా కాపాడుతుంది. వీటి విత్తనాల్లో ఉండే ప్రత్యేకమైన పీచు వల్ల బరువు తగ్గే అవకాశం కూడా ఉంటుంది. పొటాషియం పొట్ట దగ్గరి కొవ్వును కరిగిస్తుంది. ఈ పండును తినటం వల్ల రక్తంలోని చక్కెరస్థాయిలో స్థిరంగా ఉంటాయి. వీటిలోని విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచు తుంది. తెల్లరక్త కణాల సంఖ్య పెంచి వ్యాధికారక బ్యాక్టీరియా, వైరస్‌ల నుంచి రక్షణ కల్పిస్తుంది. కండరాలు, నరాలు రిలాక్స్ అయి మంచి నిద్ర పడుతుంది.

మలబద్ధకానికి కారణాలివే...

- ఆహారంలో సరైన ఫైబర్ లేకపోవటం
- మైదా, నూనెలో వేయించిన కారంగా ఉండే ఆహారాన్ని తినడం, తక్కువ నీరు తాగడం
- సరైన సమయానికి ఆహారాన్ని తీసుకోకపోవటం
- రాత్రిపూట ఆలస్యంగా తినటం
- కాఫీ, టీ, పొగాకు లేదా సిగరెట్లను ఎక్కువగా తీసుకోవటం

... ఈ అలవాట్లను మార్చుకోవాలి.

మంచి నిద్ర పట్టాలంటే...

ప్రతిరోజూ మనిషికి కంటి నిండా నిద్ర అవసరం. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారంతో పాటు సరైన నిద్ర కూడా పోవాలి. కొంతమంది నిద్రలేమి సమస్యతో బాధపడుతూ ఉంటారు. దానివల్ల మెదడు పనితీరు, జీర్ణక్రియ వ్యవస్థపై ప్రభావం చూపుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. శరీరంలోని మలినాలు బయటకు పోయేలా క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. అప్పుడు జీర్ణక్రియ వ్యవస్థ బాగా పనిచేస్తుంది. మెదడు బాగా అలిసిపోయి నిద్ర త్వరగా పడుతుంది. మెదడుపై ఒత్తిడి పెంచే మానసిక ఆలోచనలు తగ్గించాలి. శరీరంలో మెగ్నీషియం తగ్గినప్పుడు త్వరగా నిద్రపట్టదు. రాత్రి పడుకునే ముందు గుప్పెడు మెగ్నీషియం స్ఫటికలు గోరు వెచ్చని నీటిలో వేసి కాళ్లను అరగంట పాటు ఉంచాలి. అప్పుడు త్వరగా నిద్రపడుతుంది. రాత్రి భోజనం 8 గంటల లోపు త్వరగా జీర్ణం అయ్యే తక్కువ మోతాదులో ఆహారాన్ని తినాలి. సి విటమిన్ అధికంగా ఉండే అరటికాయ, నల్ల ద్రాక్ష, కమల పండ్లను తినాలి. రోజుకు ఐదు లీటర్ల మంచినీళ్లను క్రమం తప్పకుండా తీసుకోవాలి. గోరువెచ్చని మంచినీళ్లు తాగితే ఇంకా మంచిది. రాత్రి వేళలో టీ, కాఫీలు తీసుకోకూడదు. ప్రతి రోజూ గ్లాసు పాలు తాగాలి. పడుకునేముందు పుస్తకం చదవడం, మంచి సంగీతాన్ని వినడం వల్ల త్వరగా నిద్రపడుతుంది.



గాఢ నిద్ర రావాలంటే...

ఎన్ని గంటలు నిద్రపోయామన్నది కాకుండా ఎంత గాఢంగా నిద్రపోయామన్నది ముఖ్యం. అలా నిద్ర పట్టాలంటే పడకగది కూడా సౌకర్యంగా ఉండాలి. అందుకోసం పడక గదిని ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసుకోవాలి. మనకు నిద్ర రావటానికి మెలటోనిన్ అనే హార్మోను ఉపయోగపడుతుంది. ఇది కేవలం చీకటిలో ఉన్నప్పుడు మాత్రమే విడుదలవుతుంది. అందుకే పడకగదిలో చీకటి ఉండేలా చూసుకోవాలి.

దుప్పట్లు, దిండ్లు ఇలా...

కొన్ని రకాల రంగులూ నిద్ర రావటానికి తోడ్పడతాయి. ముఖ్యంగా గులాబీ, నీలం, వంగపండు రంగులు కళ్లకు ప్రశాంతతనిస్తాయి. అందుకే పడకగదిలో ఈ రంగులతో పెయింట్ వేయిస్తే మంచిది. ముదురురంగుల జోలికి వెళ్లకపోవటమే మంచిది. పరుపు మీద దుప్పట్లు, దిండ్ల విషయంలోనూ జాగ్రత్తలు అవసరం. సిల్కు వాటికి బదులు కాటన్ వాటికే ప్రాధాన్యత ఇవ్వాలి. పరుపును ఎప్పుడూ ఒకే దిశలో కాకుండా అటు, ఇటూ మారుస్తుంటాలి.

పుస్తకం చదవటం మేలు

రాత్రిళ్లు పడుకునేముందు లావెండర్, వెనిల్లా వాసనలు వచ్చే పరిమళాలు రాసుకుంటే మంచి నిద్ర పడుతుంది. పడక గదిలో టీవీ, కంప్యూటర్ లాంటివి పెట్టుకోవద్దు. నిద్రపోవటం మానేసి వాటితో గడిపేందుకు ప్రాధాన్యత ఇస్తుంటాం. ఈ రెండూ నిద్రకు ఆటంకంగా మారతాయి. వాటికి బదులుగా ఓ పుస్తకం చదువుకునేలా చూసుకోవాలి. తద్వారా నిద్ర కూడా త్వరగా పడుతుంది.

మనోళ్లు బంగారం

● మహిళల జట్టుకు పసిడి పతకం ● ఆసియా టీమ్ చాంపియన్‌షిప్స్



షా ఆలమ్ (మలేషియా) : భారత బ్యాడ్మింటన్‌లో సరికొత్త చరిత్ర. మన అమ్మాయిలు సరికొత్త చరిత్ర సృష్టించారు. ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్స్‌లో పసిడి పతకం కొల్లగొట్టారు. అగ్రజట్లు చైనా, జపాన్, థాయ్‌లాండ్, మలేషియా పోటీపడే ఈవెంట్‌లో భారత అమ్మాయిలకు ఇప్పటివరకు ఒక్క మెడల్ దక్కలేదు. కానీ తాజా ఈవెంట్‌లో యువ షట్లర్లు చరిత్ర తిరగరాశారు. ఆదివారం జరిగిన ఫైనల్లో థాయ్‌లాండ్‌పై 3-2తో ఉద్విగ్న విజయం సాధించారు. ఆసియా టీమ్ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు చారిత్రక పసిడి పతకం అందించారు. తొలి సింగిల్స్‌లో పి.వి సింధు 21-12, 21-12తో సుపనిదపై వరుస గేముల్లో గెలుపొంది శుభారంభం చేయగా.. తొలి డబుల్స్‌లో ట్రెసా జాలి, గాయత్రి పుల్లెల సైతం విజయం సాధించారు.

21-16, 18-21, 21-16తో మూడు గేముల మ్యాచ్‌లో పైచేయి సాధించారు. దీంతో భారత్ 2-0తో పసిడికి అడుగు దూరంలో నిలిచింది. కానీ రెండో సింగిల్స్‌లో అష్మిత చాలిహ 11-21, 14-21తో, రెండో డబుల్స్‌లో ప్రియ, శృతి మిశ్రా 11-21, 9-21తో పరాజయం పాలయ్యారు. నిర్ణయాత్మక ఐదో గేమ్ ముంగిట భారత్, థాయ్‌లాండ్ 2-2తో సమవుజ్జీలుగా నిలిచారు.

అన్మోల్ అదుర్స్ : వరల్డ్ నం.472 అన్మోల్ కార్బ్ మళ్లీ అద్భుతం చేసింది. వరల్డ్ నం.45 చోకివాంగ్‌పై సంచలన విజయం నమోదు చేసింది. ఎటువంటి అంచనాలు లేకుండా ఆసియా చాంపియన్‌షిప్స్‌కు వచ్చిన అన్మోల్.. వరుస విజయాలతో అందరి దృష్టిని తనవైపునకు తిప్పుకుంది. 21-14, 21-9తో థాయ్‌లాండ్ షట్లర్‌ను చిత్తు చేసిన అన్మోల్ వరుస గేముల్లోనే నిర్ణయాత్మక మ్యాచ్‌ను భారత్ వశం చేసింది. అన్మోల్ విజయంతో 3-2తో భారత్ పసిడి పతకం సొంతం చేసుకుంది. భారత్ కంటే మెరుగైన ర్యాంక్ షట్లర్లతో బరిలోకి దిగిన థాయ్‌లాండ్ సిల్వర్ మెడల్‌తో సరిపెట్టుకుంది.

నితీశ్, ప్రజ్ఞయ్ సెంచరీలు

రంజీ ట్రోఫీ ప్లేట్ లీగ్ ఫైనల్

హైదరాబాద్ : నితీశ్ రెడ్డి (122, 194 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్సులు), వికెట్ కీపర్ ప్రజ్ఞయ్ రెడ్డి (102 నాటౌట్, 141 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలతో మెరువగా.. కెప్టెన్ తిలక్ వర్మ (44, 73 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. దీంతో మేఘాలయతో రంజీ ట్రోఫీ ప్లేట్ లీగ్ ఫైనల్లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 87.5 ఓవర్లలో 350 పరుగులు చేసింది. మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 304 పరుగులే చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో 0/1తో ఎదురీదుతోంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగుల వెనుకంజలో నిలిచింది.

టెస్టుల్లో బెస్టు విక్టరీ

రాజ్'కోట' మన సొంతమైంది. కీలక మూడో టెస్టులో ఆతిథ్య భారత్ అఖండ విజయం సాధించింది. పరుగుల పరంగా టెస్టుల్లో అత్యుత్తమ విజయాన్ని నమోదు చేసింది. 557 పరుగుల రికార్డు ఛేదనలో ఇంగ్లాండ్ 122 పరుగులకే కుప్పకూలింది. లోకల్ బాయ్ రవీంద్ర జడేజా (5/41) ఐదు వికెట్ల మాయజాలంతో ఇంగ్లాండ్‌ను తిప్పేశాడు. 434 పరుగుల తేడాతో భారత్ మూడో టెస్టులో అఖండ విజయం అందుకుంది. ఈ విజయంతో ఐదు మ్యాచుల టెస్టు సిరీస్‌లో 2-1తో ముందంజలోకి దూసుకెళ్లింది.

యువ కెరటం యశస్వి జైస్వాల్ (214 నాటౌట్) అజేయ ద్వి శతకంతో చెలరేగాడు. విశాఖలో కెరీర్ తొలి డబుల్ సెంచరీ బాదిన జైస్వాల్.. రాజ్‌కోట్‌లోనూ భారీ ఇన్నింగ్స్ నమోదు చేశాడు. శుభ్‌మన్ గిల్ (91)కు తోడు అరంగ్రేట ఆటగాడు సర్ఫరాజ్ ఖాన్ (68 నాటౌట్) మెరవటంతో ఇంగ్లాండ్ ముందు భారత్ భారీ లక్ష్యాన్ని ఉంచింది. భారత్, ఇంగ్లాండ్ నాల్గో టెస్టు రాంచిలో శుక్రవారం నుంచి ఆరంభం కానుంది.



● 434 పరుగులతో భారత్ అఖండ విజయం ● ఛేదనలో ఇంగ్లాండ్ 122 ఆలౌట్
● యశస్వి జైస్వాల్ అజేయ ద్వి శతకం ● రవీంద్ర జడేజా ఐదు వికెట్ల మాయజాలం

రాజ్‌కోట్

రాజ్‌కోట్‌లో ఆతిథ్య భారత్ ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసింది. తొలి రెండు టెస్టుల్లో భారత్‌కు గట్టి పోటీ ఇచ్చిన ఇంగ్లాండ్‌ను మూడో టెస్టులో చిత్తు చేసింది. రికార్డు 434 పరుగుల తేడాతో రాజ్‌కోట్ టెస్టులో టీమ్ ఇండియా విజయభేరి మోగించింది. 557 పరుగుల ఛేదనలో ఇంగ్లాండ్ 39.4 ఓవర్లలో 122 పరుగులకే కుప్పకూలింది. లోకల్ హీరో రవీంద్ర జడేజా (5/41) ఐదు వికెట్ల మాయజాలానికి కుల్దీప్ యాదవ్ (2/19), అశ్విన్ (1/19), బుమ్రా (1/18) జత కలిశారు. దీంతో మూడో టెస్టు సైతం నాలుగు రోజుల్లోనే ముగిసింది. ఇంగ్లాండ్ బ్యాటింగ్ లైనప్ భారత బౌలర్లకు దాసోహం అవగా.. టెయిలెండర్లు మార్క్‌వుడ్ (33, 15 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), టామ్ హార్ట్‌లీ (16, 36 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) ఇంగ్లాండ్‌కు గౌరవప్రద మూడంకెల స్కోరు అందించారు. అంతకముందు, భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 430/4 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (214 నాటౌట్, 236 బంతుల్లో 14 ఫోర్లు, 12 సిక్సులు) అజేయ ద్వి శతకం బాదగా.. సర్ఫరాజ్ ఖాన్ (68 నాటౌట్, 72 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సులు) అజేయ అర్ధ సెంచరీతో చెలరేగాడు. శుభ్‌మన్ గిల్ (91, 151 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో మెరువగా 98 ఓవర్లలో 430 పరుగుల వద్ద భారత్ ఇన్నింగ్స్‌ను డిక్లరేషన్ ప్రకటించింది. తొలి ఇన్నింగ్స్‌లో శతకం బాదిన రవీంద్ర జడేజా.. బంతితో ఏడు వికెట్లు పడగొట్టి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. రాజ్‌కోట్ టెస్టులో విజయంతో సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యం సాధించింది.

ఇంగ్లాండ్‌ను తిప్పేశారు

ఇంగ్లాండ్ లక్ష్యం రికార్డు 557 పరుగులు. ఎటువంటి బ్యాటింగ్ లైనప్ అయినా.. ఈ లక్ష్యాన్ని ఛేదించటం కష్టసాధ్యమే. కానీ ఇంగ్లాండ్ బజ్‌బాల్ దూకుడుతో కనీసం రేసులో నిలుస్తుందనే అంచనాలు ఉన్నాయి. కానీ భారత బౌలర్లు మ్యాచ్‌ను ఏకపక్షం చేశారు. టీ విరామానికి ముందు 8.2 ఓవర్లలోనే ఓపెనర్లు ఇద్దరినీ పెవిలియన్‌కు పంపించారు. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో బెన్ డకెట్ (4) రనౌట్‌గా నిష్క్రమించాడు. క్రాప్లీ సిగ్నల్ ఇవ్వకుండానే సగం దూరం వెళ్లిన డకెట్.. తిరిగి క్రీజులోకి వచ్చేలోగా సిరాజ్ సూపర్ ఫీల్డింగ్‌తో వికెట్లను జురెల్ పడగొట్టాడు. జాక్ క్రాప్లీ (11)ని



ఎల్బీగా బుమ్రా సాగనంపాడు. దీంతో 18/2 పరుగులకే ఇంగ్లాండ్ ఓపెనర్లను కోల్పోయింది. ఇక చివరి సెషన్లో ఇంగ్లాండ్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ఒలీ పోప్ (3), జో రూట్ (7), జానీ బెయిర్‌స్టో (4), బెన్ ఫోక్స్ (16) సహా మార్క్‌వుడ్ (33)ను రవీంద్ర జడేజా మాయ చేశాడు. జడేజా మాయకు ఇంగ్లాండ్ ఓ దశలో 50/7తో దీన స్థితిలో నిలిచింది. కానీ టెయిలెండర్లు వేగంగా పరుగులు సాధించి ఆ జట్టును 100 పరుగుల మార్క్ దాటించగలిగారు. కుల్దీప్ యాదవ్ రెండు వికెట్లు తీసుకోగా.. కుటుంబ వైద్య అత్యవసర పరిస్థితితో రెండు రోజుల ఆటకు దూరంగా ఉన్న రవిచంద్రన్ అశ్విన్ నాల్గో రోజు బంతి అందుకున్నాడు. టామ్ హార్ట్‌లీ (16)ని అవుట్ చేసి కెరీర్ 501వ వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. ఐదో రోజుకు వెళు‌తుందనుకున్న టెస్టు మ్యాచ్.. భారత బౌలర్ల దూకుడుతో నాలుగు రోజుల్లోనే ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో 71.1 ఓవర్లలో 319 పరుగులు చేసిన ఇంగ్లాండ్.. రెండో ఇన్నింగ్స్‌లో 39.4 ఓవర్లలో 122 పరుగులకే చేతులెత్తేసింది.

'ద్వి శతక' జైస్వాల్

యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (214 నాటౌట్) ద్వి శతకంతో చెలరేగాడు. విశాఖ టెస్టులోనూ డబుల్ సెంచరీ బాదిన జైస్వాల్.. రాజ్‌కోట్‌లోనూ జోరు కొనసాగించాడు. వెన్నునొప్పితో మూడో రోజు ఆఖర్లో రిటైర్డ్ హర్ట్‌గా వైదొలిగిన యశస్వి.. నాల్గో రోజు ఉదయం సెషన్లోనే క్రీజులోకి వచ్చాడు. సర్ఫరాజ్ ఖాన్ (68 నాటౌట్) జతగా 184 పరుగులు జోడించాడు. 11 ఫోర్లు, 7 సిక్సర్లతో 150 పరుగుల మార్క్ చేరుకున్న జైస్వాల్.. ద్వి శతకాన్ని 14 ఫోర్లు, 10 సిక్సర్లతో 231 బంతుల్లోనే పూర్తి చేశాడు. మరోవైపు సర్ఫరాజ్ ఖాన్ అరంగ్రేట టెస్టులో వరుసగా రెండో అర్ధ సెంచరీ సాధించాడు. ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 65 బంతుల్లో అర్ధ సెంచరీ బాదాడు. టాప్ ఆర్డర్‌లో కీలక ఇన్నింగ్స్ నమోదు చేసిన శుభ్‌మన్ గిల్.. సెంచరీ ముంగిట వికెట్ చేజార్చుకున్నాడు. నైట్‌వాచ్‌మన్ కుల్దీప్ యాదవ్ (27) సైతం ఆకట్టుకున్నాడు. దీంతో 90 ఓవర్లలో 4 వికెట్లకు 430 పరుగులు చేసిన భారత్.. 556 పరుగుల ఆధిక్యంతో ఇన్నింగ్స్‌ను డిక్లరేషన్ ఇచ్చింది. ఇంగ్లాండ్ బౌలర్లలో టామ్ హార్ట్‌లీ, జో రూట్, రెహాన్ అహ్మద్ తలా ఓ వికెట్ పడగొట్టారు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ : 445/10

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ : 319/10

భారత్ రెండో ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ నాటౌట్ 214, రోహిత్ శర్మ (ఎల్బీ) రూట్ 19, శుభ్‌మన్ గిల్ (రనౌట్) 91, రజత్ పటీదార్ (సి) రెహాన్ (బి) హార్ట్‌లీ 0, కుల్దీప్ యాదవ్ (సి) రూట్ (బి) రెహాన్ 27, సర్ఫరాజ్ ఖాన్ నాటౌట్ 68, ఎక్స్‌ట్రాలు : 11, **మొత్తం : (98 ఓవర్లలో 4 వికెట్లకు) 430 డిక్లేర్డ్.**

వికెట్ల పతనం : 1-30, 2-191, 3-246, 4-258.

బౌలింగ్ : అండర్సన్ 13-1-78-0, జో రూట్ 27-3-111-1, టామ్ హార్ట్‌లీ 23-2-78-1, మార్క్‌వుడ్ 10-0-46-0, రెహాన్ అహ్మద్ 25-1-108-1.

ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ : జాక్ క్రాప్లీ (ఎల్బీ) బుమ్రా 11, బెన్ డకెట్ (రనౌట్) 4, ఒలీ పోప్ (సి) రోహిత్ (బి) జడేజా 3, జో రూట్ (ఎల్బీ) జడేజా 7, జానీ బెయిర్‌స్టో (ఎల్బీ) జడేజా 4, బెన్ స్టోక్స్ (ఎల్బీ) కుల్దీప్ 15, బెన్ ఫోక్స్ (సి) ధ్రువ్ (బి) జడేజా 16, రెహాన్ అహ్మద్ (సి) సిరాజ్ (బి) కుల్దీప్ 0, హార్ట్‌లీ (బి) అశ్విన్ 16, మార్క్‌వుడ్ (సి) జైస్వాల్ (బి) జడేజా 33, అండర్సన్ నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 12, **మొత్తం : (39.4 ఓవర్లలో ఆలౌట్) 122.**

వికెట్ల పతనం : 1-15, 2-18, 3-20, 4-28, 5-50, 6-50, 7-50, 8-82, 9-91, 10-122.

బౌలింగ్ : జస్‌ప్రీత్ బుమ్రా 8-1-18-1, మహ్మద్ సిరాజ్ 5-2-16-0, రవీంద్ర జడేజా 12.4-4-41-5, కుల్దీప్ యాదవ్ 8-2-19-2, రవిచంద్రన్ అశ్విన్ 6-3-19-1.

12 ద్వి శతక ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ కొట్టిన సిక్సర్లు 12. ఓ టెస్టు ఇన్నింగ్స్‌లో నవజ్యోత్ సింగ్ సిద్ధూ బాదిన 8 సిక్సర్లే ఓ భారత బ్యాటర్‌కు ఇప్పటివరకు అత్యధికం. రాజ్‌కోట్‌లో జైస్వాల్ ఆ రికార్డును బద్దలుకొట్టాడు.

434 మూడో టెస్టులో భారత్ గెలుపు అంతరం 434 పరుగులు. గతంలో న్యూజిలాండ్‌పై 372 పరుగులే విజయమే అత్యుత్తమం. పరుగుల పరంగా ఇప్పుడు రాజ్‌కోట్‌లో ఇంగ్లాండ్‌పై సాధించిన విజయం అగ్రస్థానంలో నిలిచింది.

రూ.100 కోట్లతో కొత్త స్టేడియం!

హెచ్‌సీఏ ఏజీఎంలో ఏకగ్రీవ తీర్మానం



హైదరాబాద్ : రూ.100 కోట్లతో కొత్త స్టేడియం నిర్మాణానికి హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) వార్షిక సర్వ సభ్య సమావేశం (ఏజీఎం) తీర్మానం ఆమోదించింది. ఉప్పల్ స్టేడియంలో ప్రపంచ శ్రేణి శిక్షణ కేంద్రం, హైదరాబాద్ పరిధిలో నాలుగు శాటిలైట్ అకాడమీలు సహా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో మినీ స్టేడియం నిర్మాణాలు చేపట్టనున్నారు. బీసీసీఐ నిధుల్లో కనీసం 30 నిధులను గ్రామీణ క్రికెట్ అభివృద్ధికి ఖర్చు చేయనున్నారు. అందుకోసం ఓ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. మహిళల క్రికెట్‌కు సైతం ఓ కమిటీని ఏర్పాటు చేసేందుకు ఏజీఎం ఆమోదించింది. హెచ్‌సీఏ తరపున బీసీసీఐ సమావేశానికి అధ్యక్షుడు జగన్‌మోహన్, కార్యదర్శి దేవరాజ్ రొటేషన్ విధానంలో హాజరుకావాలని సభ్యులు తీర్మానించారు. గతంలో రసాభాసాగా సాగిన హెచ్‌సీఏ సమావేశాలకు భిన్నంగా 86వ ఏజీఎం స్నేహపూర్వక వాతావరణంలో ముగిసింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68